
సిరిపురం దత్ ఐలాండ్ సమీపంలో కాన్వాయ్ నుంచి దిగి రోడ్‌షో నిర్వహించేందుకు వెళ్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు


సభా ప్రాంగణం వద్ద ప్రజలకు అభివాదం తెలుపుతున్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



ప్రధాని మోదీకి అరకు కాఫీ కిట్ అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. చిత్రంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.

విశాఖకు నవోదయం

సుమారు రెండు లక్షల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు


సభలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్

- రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమం
- గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మారనున్న విశాఖ
- ప్రధాని నరేంద్రమోదీ
- బల్క్ డ్రగ్ పార్క్‌తో వస్తూత్పత్తి రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు
- నీలి విప్లవంతో ప్రాభవాన్ని చాటనున్న నగరం
- ఫిషింగ్ హార్బర్‌ను ఆధునికీకరిస్తున్నట్టు ప్రకటన
- విశాఖను ఆర్థిక రాజధానిగా మరోసారి ఉద్ఘాటించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు


ఏయూ ఇంజనీరింగ్ గ్రౌండ్స్‌లో బుధవారం నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహిని

విశాఖపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ఘట్టం బుధవారం ఆవిష్కృతమైంది. ఒకేరోజు రూ.2 లక్షల కోట్లకుపైగా ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ ఈ స్థాయి పెట్టుబడులకు సంబంధించిన కార్యక్రమాన్ని నగరంలో నిర్వహించలేదు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ ప్రాధాన్యం గుర్తించిన కేంద్రం భారీగా నిధులు మంజూరుచేయడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. సభా వేదికపై ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశాఖ ప్రాధాన్యాన్ని మరోసారి గుర్తుచేశారు.

విద్యుత్ రంగంలో నూతన విప్లవానికి నాంది పలికిన హైడ్రోజన్ పవర్‌లో విశాఖపట్నం అత్యంత కీలకంగా మారబోతోందని ప్రధానమంత్రి ప్రకటించారు. 2030 నాటికి దేశంలో రెండు చోట్ల ... మిగతా 6వ పేజీలో


రోడ్‌షోలో ప్రజలకు అభివాదం తెలుపుతున్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

ఎట్టకేలకు రైల్వే జోన్ కల సాకారం

- ప్రధాన కార్యాలయానికి నరేంద్రమోదీ శంకుస్థాపన
- వాల్తేరు డివిజన్ కొనసాగింపుపై సందిగ్ధం

విశాఖపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం సాకారమైంది. దేశ ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగానే విశాఖ కేంద్రంగా ఏర్పాటయ్యే దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు బుధవారం శంకుస్థాపన జరిగింది. ముడసర్లోవలో జీవీఎంసీ ఇచ్చిన 52 ఎకరాల్లో జోనల్ కార్యాలయం నిర్మాణం కానుంది. ఇది శుభ పరిణామం. అయితే ఇందులో స్పష్టత లేని అనేక అంశాలు ఉన్నాయి. విశాఖ జోన్ సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)కు రైల్వే బోర్డు ఇంకా ఆమోదం తెలపలేదు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న భవన నమూనాలు డీఆర్ఎం కార్యాలయం వెనుక వైర్‌లెస్ కాలనీలో గల 12 ఎకరాల్లో జోనల్ కార్యాలయం నిర్మించాలనుకున్నప్పుడు తయారు చేసినవి. అప్పటికన్నా ఇప్పుడు అదనంగా 40 ఎకరాల భూమి అందుబాటులో ఉంది. అంటే డిజైన్లు మార్చాల్సి ఉంది.

వాల్తేరు డివిజన్ ఉంటుందా? లేదా?

కొత్తగా ఏర్పాటయ్యే దక్షిణ కోస్తా జోన్‌లో వాల్తేరు డివిజన్ ఉండదని మొదట్లో రైల్వే వర్గాలు ప్రకటించాయి. దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లతోనే జోన్ ఉంటుందని పేర్కొన్నాయి. ప్రస్తుతం ఉన్న వాల్తేరు డివిజన్‌ను ... మిగతా 6వ పేజీలో


వేదికపై మోదీ, చంద్రబాబు మాటామంతీ

రూ.2,08,548 కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపన

- అనకాపల్లి జిల్లా పూడిమడకలో ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు
- నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్...
- పూర్తయిన పలు ప్రాజెక్టులు జాతికి అంకితం

విశాఖపట్నం, జనరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ బుధవారం విశాఖపట్నంలో రూ.2,08,548 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపనలు చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించిన ప్రజా వేదిక బహిరంగ వేదికపైనే ఈ కార్యక్రమం నిర్వహించారు. అలాగే పూర్తయిన పలు ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు.

శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులు

- అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడకలో ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్
- విశాఖలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయం
- గంగవరం పోర్టు-స్టీల్‌ప్లాంటు మధ్య ... మిగతా 6వ పేజీలో

మోదీ వైఖరిపై ఉక్కు నాయకుల మండిపాటు



కూర్మన్నపాలెం రోడ్డుపై బైఠాయించిన ఉక్కు నాయకులు, కార్మికులు

- విశాఖ పర్యటనలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై ప్రధాని స్పందించకపోవడం దారుణం
- ఇది విశాఖ వేదికగా రాష్ట్రానికి చేసిన ద్రోహం
- పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, ఎన్.రామారావు

- 8వ పేజీలో

ఉత్తర ద్వార దర్శనం రేపు

- వైకుంఠ ఏకాదశికి ముస్తాబైన అప్పన్న ఆలయం
- ఉదయం 5 నుంచి 10.30 గంటల వరకూ దర్శనం



సింహాచలం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలంలో శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయం వైకుంఠ ఏకాదశి ఉత్సవానికి ముస్తాబైంది. శుక్రవారం ఉదయం ఐదు గంటల నుంచి 10.30 గంటల వరకూ సింహాచలేశుడు వైకుంఠ నారాయణుడి అలంకారంలో ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఉత్తర ద్వార దర్శనానికి ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలిస్తారు. దీంతో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్తర ద్వారం ఎదురుగా క్యూలైన్లు ఏర్పాటుచేశారు. తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి భక్తులను ఆర్టీసీ బస్సుల్లో సింహగిరికి అనుమతిస్తారు. ఏర్పాట్లను ఈవో వాంద్రత్రినాథరావు, ఈఈ శ్రీనివాసరాజు, రాంబాబు, తదితరులు పర్యవేక్షిస్తున్నారు. కాగా ఉత్తర ద్వారంలో స్వామి అతి శీఘ్ర దర్శనం కోసం రూ.500 టిక్కెట్లు అందుబాటులో ఉంచారు. ఏకాదశి విశేషమైన పొంగలి ప్రసాదాన్ని అందజేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రొటోకాల్ పరిధిలోకి వచ్చే ప్రముఖులకు మినహా ఇతరులకు అంతరాలయ దర్శనం ఉండదని తెలిపారు.

యూనిటీ మాల్‌తో చేనేతకు ఊతం

- రాష్ట్ర చేనేత, జౌళి శాఖా మంత్రి సవిత
- 5 ఎకరాల్లో రూ.172 కోట్లతో భారీ నిర్మాణం
- చేనేత, హస్తకళా విక్రయ దుకాణాలు ఏర్పాటు
- మినీ థియేటర్లు, కన్వెన్షన్ హాలు ఏర్పాటుకు చర్యలు

సాగర్‌నగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): యూనిటీ మాల్ నిర్మాణం వల్ల చేనేత, హస్త కళా ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కలగడంతోపాటు చేనేత కళాకారులకు ఆర్థిక భరోసా లభిస్తుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖా మంత్రి ఎస్.సవిత తెలిపారు. భీమిలి బీచ్‌రోడ్డులో తిమ్మాపురం వద్ద రామానాయుడు స్టూడియో సమీపాన యూనిటీమాల్‌కు కేటాయించిన స్థలాన్ని బుధవారం ఆమె...చేనేత, జౌళి శాఖ ... మిగతా 6వ పేజీలో



సభకు వెళుతున్న వారికి వాటర్ బాటిళ్లు అందిస్తున్న జడ్పీ ప్రసన్న వాణి

ప్రధాని మోదీ సభకు తరలివెళ్లిన ప్రజలు

భీమునిపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలో జరిగిన ప్రధాని నరేంద్రమోదీ సభకు భీమిలి నియోజకవర్గం నుంచి జనం భారీగా తరలివెళ్లారు. భీమిలిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు నూకాలమ్మ గుడి వద్ద నుంచి బయలుదేరిన బస్సులకు జెండాలు ఊపి ప్రారంభించారు. అలాగే 4వ వార్డులో టీడీపీ నాయకుడు పాసి త్రినాథకుమార్, జోనల్ కమిషనర్ ప్రసన్న వాణి సభకు వెళ్లేవారికి మంచినీటి బాటిళ్లు అందించారు.

పద్మనాభం రూరల్ : మండలం నుంచి మాజీ ఎంపీపీ కాళ్ల నగేశ్ కుమార్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలు మోదీ సభకు తరలివెళ్లారు.

సాగర్‌నగర్ : మోదీ సభకు 8వ వార్డు నుంచి కూటమి నాయకులు, ప్రజలు భారీగా తరలివెళ్లారు. బస్సులను 8వ వార్డు టీడీపీ అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి ప్రారంభించారు.

కొమ్మాది : జీవీఎంసీ 5, 6 వార్డుల నుంచి కూడా కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా వెళ్లారు.పీఎంపాలెం కాలనీలో టీడీపీ విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు గరే గురునాథ్ బస్సులను ప్రారంభించగా 5వ వార్డులో కార్పొరేటర్ మొల్లి హేమలత ప్రారంభించారు.

మధురవాడ : జీవీఎంసీ ఏడో వార్డు నుంచి రెండు బస్సుల్లో వెళ్లారు. కార్పొరేటర్ పిళ్లా వెంకటరావు,టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు బస్సులను ప్రారంభించారు.



విద్యుత్ లైటింగ్‌తో ధగధగలాడుతున్న భీమిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం



పూల అలంకరణలో స్వామివారు



భక్తుల రద్దీ దృష్ట్యా ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు

వైకుంఠ ఏకాదశికి శరవేగంగా ఏర్పాట్లు

పద్మనాభం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో శుక్రవారం జరిగే అనంత పద్మనాభుని గిరిప్రదక్షిణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆ రోజు తెల్లవారుజామున 3.30 గంటలకు స్వామివారికి అభిషేకాలు, 7.30 గంటలకు గ్రామసేవ, 8.15 నుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ, సాయంత్రం 5.30 గంటలకు సహస్ర దీపాలంకరణ, అనంతరం స్వామివారికి పుష్పయాగం నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ఆనందపురం : మండలంలోని పలు ఆలయాలు ముక్కోటి ఏకాదశికి సిద్ధమవుతున్నాయి. గంభీరం పైడా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో ఉన్న శ్రీ శరణ్య వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం తెల్లవారుజాము నుండే ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్టు ఆలయ నిర్మాణ ధర్మకర్త పైడా కృష్ణ ప్రసాద్ తెలిపారు. అలాగే గుడిలోవ శ్రీ రంగనాథ నారాయణేశ్వరస్వామి ఆలయంలో కూడా ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

భీమునిపట్నం : పట్టణంలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయానికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. ఈమేరకు కొండ దిగువన గాలిగోపురం నుంచి కొండపై ఆలయం వరకూ ఐరన్ బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయాన్ని కూడా అందంగా తీర్చిదిద్దుతున్నారు.

ఆలయం చెంత.. అపరిశుభ్రత

పట్టణంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద అపరిశుభ్రత నెలకొంది. తొలిపావంచ వద్ద, గాలి గోపుం పరిసరాలు, కొండపైకి వెళ్లే రోడ్డు చెత్తాచెదారంతో నిండిపోయాయి. చెత్త నుంచి వస్తున్న దుర్వాసనకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని నెలలుగా ఈ సమస్య ఉన్నా.. పట్టించుకునేనాథుడే కరువయ్యాడు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి జరగనుండడంతో అధికారులు స్పందించి ఆలయ పరిసరాలను శుభ్రం చేయాలని పలువురు కోరుతున్నారు.



గాలి గోపురం వద్ద అపరిశుభ్రత



చంద్రబాబుతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, తదితరులు

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘన స్వాగతం

గోపాలపట్నం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నగరంలో జరగనున్న ప్రధాన మంత్రి మోదీ సభలో పాల్గొనేందుకు బుధవారం వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక విమానంలో సాయంత్రం విమానాశ్రయానికి చేరుకున్న చంద్రబాబుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, ముఖ్యమంత్రి కార్యక్రమ కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేశ్, శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, ఆర్డీవో పి.శ్రీలేఖ తదితరులు స్వాగతం పలికారు.

భీమునిపట్నం : ప్రధాని మోదీ విశాఖ పర్యటనలో పాల్గొనడానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. ఆయనతో పాటు గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కూడా ఉన్నారు.

విశాఖకు నవోదయం

... 5వ పేజీ తరువాయి

గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లు ఏర్పాటు కానున్నాయని, వాటిలో ఒకటి విశాఖపట్నమన్నారు. భవిష్యత్తులో హైడ్రోజన్ గ్రీన్ ఎనర్జీ ద్వారా ఏపీలో పెట్టుబడులు, తద్వారా భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రధాని వివరించారు. నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుతో మౌలిక వసతులు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. దేశంలో మూడు చోట్ల బల్క్ డ్రగ్ పార్కులు ఏర్పాటు చేయనుండగా అందులో ఒకటి నక్కపల్లిలో వస్తోందన్నారు.

దశ మార్చనున్న నీలి విప్లవం

సముద్ర వ్యాపారంలో శతాబ్దాల చరిత్ర గల విశాఖపట్నం నీలి విప్లవంతో మరోసారి తన ప్రాభవాన్ని చాటనుందని, ఇందులో భాగంగా విశాఖలోని ఫిషింగ్ హార్బర్‌ను ఆధునికీకరిస్తున్నామని ప్రధాని వివరించారు. దశాబ్దాలుగా విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ కోసం పోరాడిన ఇక్కడి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జోన్ ప్రధాన కార్యాలయానికి శంకుస్థాపన చేశామని, తద్వారా ఏళ్ల నాటి కలను సాకారం చేశామన్నారు. కాగా, విశాఖను ఆర్థిక రాజధానిగా మరింత బలోపేతం చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పునరుద్ఘాటించారు. ప్రపంచానికి అరకు కాఫీని పరిచయం చేసిన ఘనత ప్రధాని మోదీకి దక్కుతుందన్నారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుతో ఐటీ, ఫార్మా, టూరిజం అభివృద్ధి చెందుతాయని, తద్వారా ఉపాధి అవకాశాలు పెరిగి రాష్ట్రం ఆర్థికంగా బలోపేతమవుతుందని చంద్రబాబు వివరించారు.

అండర్ పాత్ వేలో ట్రాఫిక్ ఇబ్బందులు

తగరపువలస, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస నుంచి జాతీయ రహదారి మీదకు వెళ్లడానికి నిర్మించిన అండర్ పాత్ వే రోడ్డును విస్తరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ వంతెన కింద నుంచి విజయనగరం, శ్రీకాకుళం వెళ్లడానికి అటు విశాఖ రావడానికి వీలుగా అండర్ పాత్ వే నిర్మించారు. అయితే ఈ మార్గంలో ఇష్టానుసారం వాహనాలను పార్కింగ్ చేయడం, తోపుడు బండ్లు దుకాణాల వల్ల నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వైఎస్ఆర్ కూడలిగా పిలిచే ఈ ప్రాంతంలో పోలీసు బీట్ లేకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. విజయనగరం నుంచి వచ్చే ప్రధాన వాహనాలు పాత్‌వే పక్క నుంచి వస్తుంటాయి. తగరపువలసలోకి బస్సులు, కార్లు రావాలన్నా...వెళ్లాలన్నా వంతెన కిందనుంచి రాకపోకలు సాగించాల్సి ఉంది. అండర్ పాత్ వే ఇరుగ్గా ఉండడం వల్ల రెండు వాహనాలు తప్పుకోవడానికి కూడా అవకాశం ఉండడం లేదు.అధికారులు తక్షణమే స్పందించి ఇక్కడ పోలీసు బీట్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఎట్టకేలకు రైల్వే జోన్ కల సాకారం

... 5వ పేజీ తరువాయి

రద్దు చేసి, అందులో కీలక ప్రాంతాలను కొత్తగా ఏర్పాటుచేసిన రాయగడ డివిజన్‌లో కలిపి, మిగిలిన ప్రాంతాలను విజయవాడ డివిజన్‌లో ఉంచుతారని ప్రకటించారు. అయితే వాల్తేరు డివిజన్‌తో కూడిన జోన్ ఇవ్వాలని ఈ ప్రాంత ప్రజల డిమాండ్ మేరకు నాయకులు కేంద్రాన్ని కోరారు.దానికి సానుకూల స్పందన వచ్చిందని ప్రచారం చేశారు. అయితే బుధవారం ప్రధాని సభలో వాల్తేరు డివిజన్‌పై స్పష్టత ఇవ్వలేదు. పైగా దీనికి రెండు రోజుల ముందే రాయగడ డివిజన్ పరిధిని ప్రకటించారు. దానికి డివిజన్ రైల్వే మేనేజర్‌ను కూడా నియమించారు. అంతకు ముందు డీఆర్ఎం కార్యాలయ నిర్మాణానికి శ్రీకారం కూడా చుట్టారు. ఇక్కడ జోనల్ కార్యాలయం నిర్మించాక కార్యకలాపాలు ప్రారంభిస్తామంటే మరో పుష్కర కాలం గడిచిపోతుంది. అలా కాకుండా ప్రస్తుతం అందుబాటులో ఉన్న భవనాల్లో జోనల్ కార్యాలయాలు ప్రారంభించాల్సి ఉంది. వీటిని పర్యవేక్షించడానికి జోన్‌కు జనరల్ మేనేజర్‌ను తక్షణమే నియమించాలి. అప్పుడే కేంద్రానికి చిత్తశుద్ధి ఉందని ఉత్తరాంధ్ర ప్రజలు విశ్వసిస్తారు.

కొత్త రైళ్లు...ప్రాజెక్టులు

విశాఖలో జోనల్ కార్యాలయం ప్రారంభమైతే అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఈ ప్రాంత యువతకు అవకాశాలు పెరుగుతాయి. కొత్త రైళ్లను వేసుకోవాలన్నా, అత్యవసరంగా అదనపు కోచ్‌లు ఏర్పాటు చేయాలన్నా, సరకు రవాణాకు ర్యాక్‌లు ఇవ్వాలన్నా స్థానిక అధికారులు నిర్ణయం తీసుకోవచ్చు. తయారీ, ఉత్పత్తి రంగాలకు చెందిన ప్రాజెక్టులు వస్తాయి. జోనల్ స్థాయి రైల్వే ఆస్పత్రి వస్తుంది. సుదీర్ఘమైన తీర ప్రాంతం, పోర్టులు, విమానాశ్రయాలు ఉండటం, కొత్త పరిశ్రమలు రావడం వల్ల ఈ జోన్‌కు ప్రాధాన్యం పెరుగుతుంది. ఆదాయం పెరుగుతుంది. దానికి తగ్గట్టుగానే బడ్జెట్‌లో కేటాయింపులు వస్తాయి. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన రైల్వే వసతులు లభిస్తాయి.

ప్రజా నాట్య మండలి నూతన కార్యవర్గం ఎన్నిక

భీమునిపట్నం (రూరల్), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజా నాట్య మండలి భీమిలి జోన్ అధ్యక్షుడిగా పల్ల పోతురాజు ఎన్నికయ్యారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈమేరకు భీమిలి జోన్ గౌరవాధ్యక్షుడిగా దల్లి రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా బెల్లాన రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా చిల్ల అప్పారావు, కోశాధికారిగా పంపాన సూర్యనారాయణ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఎస్. ఉమ, ఎస్. లక్ష్మీనారాయణ, గంగయ్యను సభ్యులు ఎన్నుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేయడంతో పాటు కళారూపాలు ప్రదర్శించాలని నూతన కార్యవర్గం తీర్మానించింది.

పద్మనాభంలో మండల స్థాయి కబడ్డీ పోటీలు

పద్మనాభం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్ది గ్రామంలో ఎంపీపీ కె.రాంబాబు ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 13 వరకు మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్టు వైసీపీ మండల యూత్ అధ్యక్షుడు బుగత సత్యనారాయణ తెలిపారు.బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పోటీలో పాల్గొనేవారు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, ఆధార్‌కార్డు కూడా తీసుకురావాలని చెప్పారు. ఏ గ్రామానికి చెందిన వారు ఆ గ్రామానికి మాత్రమే పోటీ చేయాలన్నారు. మొదటి బహుమతి కింద రూ7,000, రెండు, మూడు స్థానాలకు రూ. 5000, రూ. 3000 ప్రదానం చేస్తామని తెలిపారు.

'కొండపైకి ద్విచక్ర వాహనాలకు అనుమతి లేదు'

సాగర్‌నగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలో ఉన్న శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి వైకుంఠ ఏకాదశి రోజున కొండపైకి ద్విచక్ర వాహనాలను అనుమతించమని ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్తర ద్వార దర్శనానికి వేలాది మంది భక్తులు రానుండడంతో కొండపై పార్కింగ్ సమస్య తలెత్తకుండా బైక్‌లను అనుమతించడం లేదని చెప్పారు. భక్తుల సౌకర్యార్థం అదనంగా రెండు బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు.

నేటి నుంచి శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

మధురవాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శిల్పారామంలో గురువారం నుంచి ఈనెల 16వ తేదీ వరకు సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్టు పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం రంగవల్లులు పోటీలు, శుక్రవారం గాలిపటాలు ఎగురవేత, 11 నుంచి 16 వరకు ప్రతిరోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందన్నారు. ముగ్గుల పోటీ, గాలి పటాలు పోటీల్లో విజేతలకు ఈనెల 15న బహుమతులు ప్రదానం చేస్తామని చెప్పారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

ఆనందపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తర్లువాడ గ్రామంలో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 10 లక్షల మండల పరిషత్ నిధులతో ఈ రోడ్డు నిర్మిస్తున్నామని చెప్పారు. పంచాయతీలోని అన్ని గ్రామాలకు సీసీ రోడ్లు, కాలువలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మజ్జి వెంకటరావు, నాయకులు తాత్రాజు అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : అప్పన్నస్వామి నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన మణి గాయత్రి, శైలేశ్ కుమార్, ఉదయ శంకర్ సంయుక్తంగా రూ.లక్ష విరాళంగా అందజేశారు. బుధవారం వారు ఆలయ ప్రోటోకాల్ సహాయ కార్యనిర్వహణాధికారి వి. రాంబాబు, ప్రోటోకాల్ సూరింటెండెంట్ విక్రమ్‌కు నగదు రూపంలో మొత్తాన్ని అందించారు. అధికారులు ఆలయ ఆచారం ప్రకారం దాతలకు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు ఇచ్చారు.



జేవీ అగ్రహారం గ్రామానికి వెళ్లే రహదారిలో ఏర్పడిన గోతులు



వార్డు సచివాలయం సమీపంలో దుస్థితి

అధ్వానంగా జేవీ అగ్రహారం రోడ్డు

భీమునిపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 4వ వార్డు జేవీ అగ్రహారం రహదారి గోతులతో అధ్వానంగా ఉంది. దీంతో పాదచారులు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడి నుంచి దొరతోట వెళ్లే రోడ్డులో జేవీ అగ్రహారం జంక్షన్ నుంచి గ్రామంలోకి సుమారు కిలోమీటర్నర దూరం ఉంటుంది. ఈ మార్గంలో నిడిగట్టు, నేరేళ్లవలస, ఎస్సీ కాలనీ ప్రజలతో పాటు చేపలుప్పాడ వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. జేవీ అగ్రహారం జంక్షన్ నుంచి గ్రామంలోకి వెళ్లే రోడ్డు బూరపేట ప్రాథమిక ప్రాఠశాల, వార్డు సచివాలయం, యాతపేట తదితర ప్రాంతాల్లో పూర్తిగా గోతులమయమైంది. దీంతో వాహనదారులతో పాటు పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో నరకయాతన అనుభవిస్తున్నారు. ఎక్కడ గొయ్యి ఉందో తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు. గత ప్రభుత్వం ఈ రోడ్డు మరమ్మతుపై కనీసం దృష్టిసారించలేదు.



యాతపేట వద్ద రహదారిపై గోతులు



పైప్‌లైన్ మరమ్మతు చేస్తున్న సిబ్బంది

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

భీమునిపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సారిపల్లి జంక్షన్‌లో అయిదు రోజులుగా తాగునీటి పైపులైన్లు లీకవుతున్నాయి. జీవీఎంసీ వాటర్ సప్లై విభాగం ఇంజనీరింగ్ సిబ్బంది మూడు రోజులుగా మరమ్మతు చేస్తున్నా.. సమస్య ఎక్కడ ఉందో తెలియడం లేదు. భూ గర్భంలో నుంచి నీరు లీకవడం, అదంతా రోడ్డుపై ప్రవహిస్తుండడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం సారిపల్లి నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఉన్న మెయిన్ రోడ్ బిటి రహదారి మధ్యలో తవ్వకాలు జరిపి లీకేజిని గుర్తిస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.



తిరువీధిలో ఊరేగుతున్న స్వామివారు

వైభవంగా పగల్‌పత్ ఉత్సవాలు

సింహాచలం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా స్వామివారికి పగల్పత్ సేవ బుధవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవ, ప్రభాత ఆరాధనలు పూర్తి చేసి ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని ఉభయదేవేరులతో స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి పల్లకిలో అధిష్ఠంపజేశారు. షోడశోపచారాలు సమర్పించిన తరువాత ఆస్థాన విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల మంత్రోచ్చారణల నడుమ బేడామండప తిరువీధి జరిపారు. అనంతరం స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో అధ్యాపకులు నాలాయిర దివ్య ప్రబంధ పారాయణం చేశారు.

బ్రహ్మకుమారి సంస్థకు స్థలం ఇవ్వాలని వినతి

మహారాణిపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం క్షేత్రం వద్ద జ్ఞాన విజ్ఞాన కేంద్రం, ఆధ్యాత్మిక మ్యూజియం, ఆసుపత్రి నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని ప్రజాపిత బ్రహ్మ కుమారి ప్రతినిధులు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కోరారు. బుధవారం హోటల్ నోవాటెల్‌లో ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరయ్య విద్యాలయం ప్రతినిధులు రామేశ్వరి తన సహచర బృందంతో పాటు డిప్యూటీ సీఎంను కలిసి వినతిపత్రం అందించారు.

సహకార పరపతి సంఘం సభ్యులకు డివిడెండ్లు పంపిణీ

సింహాచలం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : అడవివరం కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యులకు సొసైటీ భవనంలో బుధవారం డివిడెండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి మాట్లాడుతూ సొసైటీ షేర్ ధనంపై 20 శాతం వడ్డీ, డిపాజిట్‌పై 8 శాతం సభ్యులకు అందిస్తున్నట్టు తెలిపారు. సభ్యులు తప్పనిసరిగా కేవైసీ చేయించుకోవాలని సూచించారు. సకాలంలో రుణాలు చెల్లించి సంఘ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు బి. మహేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు బి. ప్రసాదరెడ్డి, ఎం. ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.



సభ్యులకు డివిడెండ్లు, క్యాలెండర్లు పంపిణీ చేస్తున్న సొసైటీ అధ్యక్షుడు అప్పలస్వామి

పూర్తి కానున్న దుకాణ సముదాయం నిర్మాణం

భీమునిపట్నం,జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మెయిన్ రోడ్‌ను ఆనుకుని నిర్మిస్తున్న మునిసిపల్ దుకాణాల సముదాయం పనులు తుది దశకు చేరుకున్నాయి. 40 ఏళ్ల క్రితం మునిసిపల్ లాల్ బహదూర్‌శాస్త్రి మార్కెట్‌లో ఈ దుకాణ సముదాయాన్ని నిర్మించారు. గదులు శిథిలావస్థకు చేరడంతో 2021 ఆగస్టు నెలలో జీవీఎంసీ అధికారులు వీటినితొలగించారు. దుకాణాల్లో ఉన్న లీజుదారులకు నోటీసులు జారీ చేసి, ఖాళీ చేయించారు. అనంతరం పునర్నిర్మాణానికి జీవీఎంసీ రూ. కోటి 50 లక్షలు సాధారణ నిధులు మంజూరు చేయడంతో కొత్తగా నిర్మాణాలను ప్రారంభించారు. ఎన్నికలకు ముందు శంకుస్థాపన జరిగిన ఈ పనులు ఈనెలాఖరు నాటికి పూర్తి చేయడానికి జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు కృషి చేస్తున్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇటీవల ఈ నిర్మాణాలను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 11 దుకాణాలు నిర్మిస్తున్నారు. పనులు పూర్తయిన తరువాత నిబంధనల మేరకు అధికారులు బహిరంగ వేలం నిర్వహించి లీజుకు ఇవ్వనున్నారు.



నిర్మాణంలో ఉన్న మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్

రూ.2,08,548 కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపన

... 5వ పేజీ తరువాయి

3, 4 రైల్వే లైన్ల నిర్మాణం

- దువ్వాడ-సింహాచలం (ఉత్తర) మధ్య మూడు, నాలుగు రైల్వే లైన్ల నిర్మాణం
- విశాఖ-గోపాలపట్నం మధ్య 3, 4 రైల్వే లైన్ల నిర్మాణం
- గుత్తి-పెండేకల్లు మధ్య రైల్వే లైన్ డబ్లింగ్
- మహబూబ్‌నగర్-డోన్ మధ్య రైల్వే లైన్ విద్యుద్దీకరణ
- ఎన్‌హెచ్-167కి ఆదోని వద్ద బైపాస్ నిర్మాణం
- డోర్నాల నుంచి కుంట జంక్షన్ వరకు ఎన్‌హెచ్-765 రెండో లేన్ నిర్మాణం
- సంగమేశ్వరం నుంచి నల్లకాలువ సెక్షన్ వరకు ఎన్‌హెచ్-167 రెండో లేన్ విస్తరణ
- ఎన్‌హెచ్ 67 నుంచి తాడిపర్తికి నాలుగో లేన్ నిర్మాణం
- ఎన్‌హెచ్-167బి లో మైదుకూరు నుంచి ముదిరెడ్డిపల్లి వరకు రెండో లేన్ నిర్మాణం
- ఎన్‌హెచ్-440లో వేంపల్లి నుంచి చాగలమర్రి వరకు రెండు, నాలుగో లేన్ల విస్తరణ
- ఎన్‌హెచ్-565లో దావులపల్లి నుంచి మల్లెపాలెం వరకు రెండో లేన్ నిర్మాణం
- ఎన్‌హెచ్-365బీబీలో బుట్టాయగూడెం నుంచి పట్టిసీమ వరకు రెండో లేన్ విస్తరణ
- ఎన్‌హెచ్-167 ఏజీలో కొండమోడు - పేరేచర్ల సెక్షన్ వరకు నాలుగో లేన్ విస్తరణ
- ఎన్‌హెచ్-516ఈ పాడేరుకు బైపాస్ రహదారి నిర్మాణం
- అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్ అభివృద్ధి
- కృష్ణపట్నం ఇండస్ట్రియల్ ఏరియాలో క్రిస్ సిటీ నిర్మాణం

జాతికి అంకితం చేసినవి

గుర్తి-ధర్మవరం రైల్వే లైన్ డబ్లింగ్, విజయవాడ-గుడివాడ-భీమవరం-నర్సాపూర్, గుడివాడ-మచిలీపట్నం, భీమవరం-నిడదవోలు రైలు మార్గాల విద్యుద్దీకరణ, ఇంకా మరో ఎనిమిది ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు.

యూనిటీ మాల్‌తో చేనేతకు ఊతం

... 5వ పేజీ తరువాయి

కమిషనర్ రేఖారాణితో కలిసి పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.172 కోట్లతో చేపడుతున్న నిర్మాణ ప్లాన్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాలుగు అంతస్థుల్లో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా భవన నిర్మాణం చేపడుతున్నామన్నారు.

వ్యాపారం, వినోదం

వ్యాపార అవసరాలతో పాటు వినోదం అందించేలా యూనిటీమాల్‌ను నిర్మించనున్నట్టు మంత్రి వివరించారు. జీప్లస్ 4గా నిర్మించే భవనంలో మొదటి రెండు అంతస్థుల్లో 62 షాపులు, మూడో అంతస్థును సీఫ్యూగా తీర్చిదిద్ది రెస్టారెంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. నాలుగో అంతస్థులో కన్వెన్షన్ హాలుతో పాటు రెండు మినీ థియేటర్లు, రిటైల్ స్టోర్లు, రెస్టారెంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఒకే భవనంలో వ్యాపారం, వినోదం లభించేలా ప్లాన్ రూపొందించామన్నారు. రుషికొండ బీచ్, రామానాయుడు స్టూడియో తదితర ప్రదేశాలను సందర్శించే పర్యాటకులను ఆకట్టుకునేలా యూనిటీమాల్‌ను నిర్మిస్తామన్నారు.



మెడ్‌టెక్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన దివ్యాంగ క్రీడాకారులు

మెడ్‌టెక్‌కు చేరుకున్న దివ్యాంగ క్రీడాకారులు

గాజువాక, జనవరి 8: జాతీయ స్థాయి బోసియా చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు దివ్యాంగ క్రీడాకారులు బుధవారం మెడ్‌టెక్‌కు చేరుకున్నారు. ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు విశాఖ మెడ్‌టెక్ జోన్‌లో జాతీయ స్థాయి బోసియా పోటీలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ పోటీల్లో దేశంలోని 21 రాష్ట్రాలకు చెందిన సుమారు 103 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. గురువారం నాటికి మొత్తం క్రీడాకారులు ఇక్కడకు చేరుకోనున్నారు. క్రీడా పోటీల నిర్వహణకు గాను అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సువిశాలమైన ఆరు కోర్టులను, ప్రాక్టీస్ చేసుకునేందుకు గాను రెండు కోర్టులను సిద్ధం చేశారు. బుధవారం ఇక్కడకు చేరుకున్న కొంత మంది క్రీడాకారులు ప్రాక్టీస్‌కు శ్రీకారం చుట్టారు. కాగా ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులంతా వీల్‌చైర్లకే పరిమితమయ్యే పరిస్థితి ఉండడంతో వారికి వసతి సదుపాయాలను క్రీడా ప్రాంగణానికి సమీపంలోనే మెడ్‌టెక్ సంస్థ ఏర్పాటు చేసింది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరగనున్న ఈ పోటీలను పర్యవేక్షించేందుకు గాను దేశ, రాష్ట్ర స్థాయి నుంచి బోసియా స్పోర్ట్స్ ఫెడరేషన్లకు చెందిన ప్రత్యేక ప్రతినిధులు ఇప్పటికే ఇక్కడకు చేరుకున్నారు.



కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న దివ్యాంగులు

షాపింగ్ మాల్స్‌కు పండగ కళ

- రద్దీగా మారిన వస్త్ర దుకాణాలు
- నిత్యం రూ.లక్షల్లో వ్యాపారం
- కొనుగోలుదారులతో రద్దీగా మారిన గోపాలపట్నం ప్రధాన రహదారి

గోపాలపట్నం, జనవరి 8 (గోపాలపట్నం): సంక్రాంతి పండగ సమీపిస్తుండడంతో బజారులకు పండగ శోభ వచ్చింది. నెల ఆరంభం నుంచే వ్యాపారాలు జోరందుకున్నాయి. వ్యాపార సముదాయాలకు కేంద్రమైన గోపాలపట్నంలో భారీ షాపింగ్ మాల్స్, వస్త్ర దుకాణాలు పెద్ద సంఖ్యలో ఉండడంతో శివారు ప్రాంతాలతో పాటు గోపాలపట్నం పరిసర ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో కొనుగోలుదారులు ఇక్కడకు వస్తుండడంతో ఈ రోడ్డు రద్దీగా మారుతోంది. ఇక్కడి షాపింగ్ మాల్స్, వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. జనాల రద్దీగా పెరగడంత ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముమ్మరంగా గస్తీ నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు.

జోరందుకున్న విక్రయాలు

పెద్ద పండక్కి ఇంకా పది రోజులే గడువు ఉండడంతో కొనుగోళ్లు జోరందుకున్నాయి. ఉదయం నుంచి ఆయా దుకాణాల్లో రద్దీ ప్రారంభమై రాత్రి వరకూ కొనుగోలుదారుల తాకిడితో రద్దీగా కనిపి స్తున్నాయి. క్రిస్మస్ నుంచే అమ్మకాలు జోరుగా సాగుతు న్నాయని పలువురు వ్యాపారులు



కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న గోపాలపట్నం ప్రధాన రహదారి

చెబుతున్నారు. గోపాలపట్నం ప్రధాన రహదారిలోని షాపింగ్ మాల్స్‌కు ఉదయం కంటే సాయంత్రం నుంచి కొనుగోలుదారుల తాకిడి మరింత ఎక్కువగా కనిపిస్తుంది. సాయంత్రం నాలుగు నుంచి రాత్రి పది గంటల వరకు ఆయా షాపింగ్ మాల్స్, వస్త్ర దుకారాలు కళకళలాడుతున్నాయి. గోపాలపట్నం కేంద్రంగా పదుల సంఖ్యలో ఉన్న వస్త్ర దుకాణాలు, షాపింగ్ మాల్స్‌లో నిత్యం రూ.కోట్లలో వ్యాపారం జరుగుతుంది. పండగ సీజనైన క్రిస్మస్ ముందు నుంచి సంక్రాంతి వరకు గోపాలపట్నం కేంద్రంగా సుమారు రూ.200 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందని అంచనా.

ఫుట్‌పాత్ వ్యాపారం కూడా..

భారీ షాపింగ్ మాల్స్, వస్త్ర దుకాణాలతో పాటు ఫుట్‌పాత్‌పై కూడా విక్రయాలు జోరుగానే సాగుతున్నాయి. ముఖ్యంగా పండగ సీజన్ నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుంచి వస్త్రాలు తీసుకువచ్చి ఫుట్‌పాత్‌లపై విక్రయించే వర్తకులు కూడా పెరగడంతో అమ్మకాలు ఆశాజనకంగా సాగుతున్నాయి. దీంతో గోపాలపట్నం ప్రధాన రహదారిలో కొనుగోలుదారుల రద్దీ రోజురోజుకూ మరింత అధికమవుతుంది. కాగా గోపాలపట్నం ప్రధాన రహదారిలో వాహన చోదకులే కాకుండా ఫుట్‌పాత్‌పై రాకపోకలు సాగించడానికి కూడా వీల్లేనంత రద్దీ నెలకొంటుంది. దీంతో ఆయా వ్యాపార సముదాయాలకు వచ్చే కొనుగోలుదారులు తమ వాహనాలను పార్కింగ్ చేసేందుకు స్థలాలు లేకపోవడంతో రహదారికి ఆనుకుని ఉన్న లింక్ రోడ్లలో నిలిపివేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.



ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న లింక్ రోడ్డులో వాహనాలు నిలిపిన దృశ్యం



కార్యకర్తలకు అభివాదం చేస్తున్న పవన్‌కల్యాణ్

పవన్‌కల్యాణ్‌కు సాదర స్వాగతం

గోపాలపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ సభలో పాల్గొనేందుకు నగరానికి విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. బుధవారం మధ్యాహ్నం ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఆయనకు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గం గుండా హోటల్ నోవాటెల్‌కు వెళ్లారు.

పీసీసీ అధికార ప్రతినిధి గృహ నిర్బంధం

పెదగంట్యాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలును న్యూపోర్టు పోలీసులు బుధవారం గృహ నిర్బంధం చేశారు. ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా నడుపూరులోని ఆయన నివాసంలో బుధవారం ఉదయం హౌస్ అరెస్టు చేశారు. ప్రధాని విశాఖ నుంచి వెళ్లిపోయాక సొంత పూచీకత్తులపై ముత్యాలును విడుదల చేశారు.


కల్యాణ వెంకన్నకు నక్షత్ర హారతి పూజలు



ఆలయంలో హారతులు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు

అగనంపూడి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 79వ వార్డు పరిధి శాంతినగర్‌లో గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి ప్రధాన అర్చకులు సత్యనారాయణ ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. 24వ పాశురాన్ని చదివి వినిపించి విశిష్టతను వివరించారు. భక్తులు హారతులు వెలిగించి స్వామివారికి చూపారు. అలాగే 58 వత్తులతో నక్షత్ర హారతితో శ్రీవారికి, గోదాదేవికి పూజలు జరిపారు. గొబ్బెమ్మలు ఏర్పాటు చేశారు. సంగీత కచేరీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఈకే చారి, కమిటీ ప్రతినిధులు మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, నరసింగరావు, సాయిబ్‌నాయుడు, కృష్ణారావు, గురునాథ్, మోహిని, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కోనేటి రాయుడికి నవనీతం, డ్రై ఫ్రూట్స్‌తో అలంకరణ



కూర్మన్నపాలెం: గ్రేటర్ 88వ వార్డు పరిధి గ్రీన్ సిటీలో శ్రీదేవి, భూదేవి సమేత వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కోనేటిరాయుడిని నవనీతం, డ్రై ఫ్రూట్స్‌తో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా లక్ష పత్రి తులసీ పూజ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్ బండి సురేశ్‌కుమార్, వీవీ కృష్ణారావు, పద్మావతి, రాజ్యలక్ష్మి, సుబ్రహ్మణ్యం, సునీల్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.



వెంకటాద్రిపై పంచామృతాభిషకం చేస్తున్న దృశ్యం

పెందుర్తి: ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి మూలవిరాట్‌కు పవిత్ర జలాలతో చక్ర స్నానమాచరించారు. అనంతరం స్వామివారికి పంచామృతాభిషేకాలు జరిపారు. గోదాదేవి పాశురాన్ని స్వామికి నివేదించారు.

వేపగుంట: నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వెంకన్న ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. దీపాల పాశురాన్ని పురస్కరించుకుని భక్తులతో వెలిగించిన దీపాలకు పూజలు జరిపాక గోదాదేవి ఉత్సవవిగ్రహం ముందు పెట్టి దీప హారతి సమర్పించారు. దీపాల పాశురం విశిష్టతను అర్చకులు శ్రీనివాసస్వామి భక్తులకు వివరించారు.

ముక్కోటి ఏకాదశి పూజలకు గరుడాద్రి సిద్ధం

పెదగంట్యాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డు పరిధి గరుడాద్రిపై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరాలయంలో ఈ నెల పదో తేదీ ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భక్తులకు ఉత్తరద్వారంలో స్వామివారి దర్శన భాగ్యం కల్పించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన రాష్ట్రంలో ఉత్తర ద్వారం నుంచి దర్శనమిచ్చే రెండో వేంకటేశ్వరాలయం ఇదేనన్నారు. అధిక సంఖ్యలో విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం ముక్కోటి ఏకాదశికి సంబంధించిన పోస్టరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల, నిర్వాహక కమిటీ సభ్యులు మిత్తని అప్పలరెడ్డి, పి.నాగేశ్వరరావు, జి.రామలక్ష్మి, టి.స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మార్పునకు చర్యలు

వేపగుంట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోట కృష్ణానగర్ హోమియో ఆస్పత్రి నిర్మాణానికి ఆటంకంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్పు చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇక్కడి హోమియో ఆస్పత్రి శిథిలావస్థకు చేరుకోవడంతో దీని స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించేందుకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే ఆస్పత్రి వెనక ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ అడ్డంగా ఉండడంతో దానిని పక్కకు మార్చే పనులను బుధవారం మధ్యాహ్నం చేపట్టారు. దీంతో ఆయా పరిసర ప్రాంతాల్లో సుమారు మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లింది. ఎట్టకేలకు హోమియో ఆస్పత్రి భవన నిర్మాణం జరగనుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నల్ల బ్యాడ్జీలతో భెల్ హెచ్‌పీవీపీ కార్మికుల నిరసన

అక్కిరెడ్డిపాలెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న జాప్యాన్ని నిరసిస్తూ భెల్ హెచ్‌పీవీపీ పరిరక్షణ ఫ్రంట్ నాయకులు బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి సంస్థ మెయిన్ గేటు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఉక్కు కార్మికులు చేపడుతున్న ఉద్యమానికి జిల్లాలో ఉన్న అన్ని సంఘటిత, అసంఘటిత రంగ కార్మిక సంఘాలు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జీటీపీ ప్రకాశ్, ఉరుకూటి బాబూరావు, వారాడ ఆనందరావు, సనపల జగన్నాథరావు, పి.కనకారావు, సీతంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడే స్టీల్ క్లబ్ ఎన్నికలు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ స్టీల్ క్లబ్ ఎన్నికలు గురువారం జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో విజయం సాధించేందుకు పోటీ పడుతున్న అభ్యర్థులు బుధవారం వరకు హోరాహోరీగా ప్రచారం సాగించారు. క్లబ్ సంయుక్త కార్యదర్శి పోస్టు ఏకగ్రీవం కాగా కార్యదర్శి స్థానానికి నలుగురు, కోశాధికారి పోస్టుకు ఐదుగురు పోటీ పడుతున్నారు. అభ్యర్థులందరూ కర్మాగారంలోని వివిధ విభాగాలలో విస్తృతంగా ప్రచారం చేసి తమ విజయానికి సహకరించాలని కోరారు.

అయితే ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న వారిలో పలువురు గతంలో అధికారం చేపట్టి క్లబ్ క్వార్టర్లు అద్దెకు ఇవ్వడం, సభ్యులకు ఇచ్చే బహుమతులను దుర్వినియోగం చేయడంతో పాటు క్లబ్‌లో డెకరేషన్, లైటింగ్‌లలో చేతివాటం చూపారనే ఆరోపణలు ఉండడంతో వారి పోటీని కొందరు సభ్యులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కాగా ఈ ఎన్నికలు గురువారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మూడున్నర వరకు, సాయంత్రం ఐదున్నర నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు జరగనున్నాయి. అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తామని ఎన్నికల అధికారి బాబూ నాయక్ తెలిపారు.

సినిమా గైడ్

- **బచ్చలమల్లి:** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2:** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యుఐ:** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2:** మెలోడీ, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 35, టమాటా 14, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 54, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 46, బీరకాయలు 52, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 16, క్యాబేజీ 18, క్యారెట్ 48, దొండకాయలు 46, బంగాళదుంపలు 27, అరటికాయ (పెద్దది) 7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 48, బరబాటి 46, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోసకాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్(పెన్సిల్) 50, పొటల్స్ 60, కీరదోస 36, క్యాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 46, చిలగడదుంపలు 36, కంద 66, దేముడుచిక్కుడు 56, గోరుచిక్కుడు 34, ఆగాకార దేశవాళీ 100, ఆగాకర హైబ్రిడ్ 100, కూర పెండలం 34, బ్రకోలి 100, నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడి కాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	102
లైవ్ ధర	122
విత్ స్కిన్	214
స్కిన్‌లెస్	224

ముగిసిన ఉక్కు కార్మికుల 36 గంటల దీక్ష

- స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగించాలి లేదా సెయిల్‌లో విలీనం చేయాలి
- పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్





దీక్షా శిబిరంలో కూర్చున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, కార్మికులు, అఖిలపక్ష నేతలు, తదితరులు. (ఇన్‌సెట్లో) కూర్మన్నపాలెం కూడలిలో పోలీస్ బందోబస్తు

కూర్మన్నపాలెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించాలని లేదా సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు చేపట్టిన 36 గంటల నిరాహార దీక్ష సజావుగా ముగిసింది. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు బుధవారం విశాఖ పర్యటనకు విచ్చేసిన నేపథ్యంలో 36 మంది కార్మికులు మంగళవారం నుంచి 36 గంటల దీక్షబూనిన సంగతి తెలిసిందే. వారికి సంఘీభావంగా సుమారు 600 మంది కార్మికులు, నిర్వాసితులు, అఖిలపక్ష నాయకులు దీక్షా శిబిరంలో కూర్చున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్‌లు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా చూడాలని లేదా సెయిల్‌లో విలీనం చేసి పూర్తి స్థాయి సామర్థ్యంతో నడపాలని కోరారు. ఉద్యోగులకు తక్షణమే నాలుగు నెలల జీతం బకాయిలను తక్షణమే చెల్లించాలని, మూడేళ్ల ట్యాక్స్ హాలిడే ప్రకటించాలని, పూర్తి సామర్థ్యంతో కర్మాగారం నడిపేందుకు ఆర్థిక సహకారం అందించాలని, ప్లాంటుకు సొంత గనులను కేటాయించాలన్నారు. అదేవిధంగా నిలిపివేసిన 800 మంది కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. కాగా ఏసీపీ త్రినాథ్ ఆదేశాల మేరకు దువ్వాడ సీఐ కె.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో సుమారు 150 మంది పోలీసులు శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా బందోబస్తు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు ఎన్.రామారావు, యు.రామస్వామి, వరసాల శ్రీనివాసరావు, నీరుకొండ రామచంద్రరావు, కేఎస్ఎన్ రావు, జె.రామకృష్ణ, బొడ్డు పైడిరాజు, వి.రామ్మోహన్‌కుమార్, ఎన్.సింహాద్రి, కారు రమణ, కేఎం శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ సభకు తరలిన కూటమి శ్రేణులు

కూర్మన్నపాలెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రోడ్ షో, బహిరంగ సభల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు, తదితరులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఇందులో భాగంగా టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ కూర్మన్నపాలెం నుంచి కూటమి శ్రేణులు బయలుదేరిన బస్సులకు జెండా ఊపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వేగుంట శ్రీను, కాదా శ్రీను, నాగార్జున, సుబ్బయ్య, త్రినాథ్, రమేశ్, నాగరాజు, తులసి, తదితరులు పాల్గొన్నారు. అలాగే 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో 21 బస్సుల్లో కూటమి శ్రేణులు పీఎం బహిరంగ సభకు తరలివెళ్లారు. 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో మహిళలు బస్సుల్లో బయలుదేరి వెళ్లారు.



టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో మోదీ సభకు బయలుదేరిన కూటమి నాయకులు, కార్యకర్తలు

పెందుర్తి: ప్రధాని మోదీ రోడ్ షో, బహిరంగ సభకు పెందుర్తి నుంచి అధిక సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. సుమారు వంద బస్సుల్లో డ్వాక్రా మహిళలు, కార్యకర్తలు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అందుకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాంపురంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, పెందుర్తి నుంచి టీడీపీ 96వ వార్డు అధ్యక్షుడు వేగి పరమేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కరక దేవుడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు వెళ్లారు.

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ఏడు వార్డుల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా సంఘాల మహిళలు ప్రధాని సభకు ఆటోల్లో వెళ్లారు. వారికి పులిహోర, మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఆయా వార్డుల నాయకులు జెండాఊపి వాహనాలను ప్రారంభించారు. కాగా మోదీ రోడ్ షోలో పాల్గొనే అవకాశం పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ప్రముఖ న్యాయవాది, బీజేపీ ఎస్సీ మోర్చా ఏపీ ఉపాధ్యక్షుడు కొక్కిలిగడ్డ విజయ్‌బాబు లభించడం పట్ల పలు దళిత సంఘాల నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయ్‌బాబు మాట్లాడుతూ తనకు ఇంత గొప్ప గుర్తింపునిచ్చిన కేంద్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

గోపాలపట్నం: ప్రధాని మోదీ పాల్గొనే బహిరంగ సభకు గోపాలపట్నం పరిసర ప్రాంతాల నుంచి భారీగా జనాలు తరలివెళ్లారు. సభకు వెళ్లేవారి కోసం ఉదయం నుంచే అధిక సంఖ్యలో వాహనాలను సిద్ధం చేశారు. కూటమి నాయకులు తగ్గరుండి వారిని సభా వేదిక వద్దకు తీసుకువెళ్లారు.

పెదగంట్యాడ: ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరిగిన ప్రధాని మోదీ సభకు 75వ వార్డు నుంచి టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి కూటమి శ్రేణులు పెద్దసంఖ్యలో వెళ్లారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు.

నాయకులు పి.సోమునాయుడు, నమ్మి అప్పారావు, కొన చినఅప్పారావు, కె.ముసలయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే 65వ వార్డు నుంచి కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు నేతృత్వంలో, 76వ వార్డు నుంచి కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, 64వ వార్డు నుంచి వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి ఆధ్వర్యంలోనే కూటమి శ్రేణులు వెళ్లారు.

అగనంపూడి: కూటమి శ్రేణులంతా స్థానిక వేపచెట్టు జంక్షన్ నుంచి పీఎం సభకు తరలి వెళ్లారు. కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ జెండా ఆయా వాహనాలను ప్రారంభించారు. ఫార్మాసిటీ పునరావాస కాలనీ, అగనంపూడి పునరావాస కాలనీల నుంచి టీడీపీ 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దశేంద్ర, జనసేన వార్డు అధ్యక్షుడు గవర సోమశేఖర్, ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. నాయకులు కరణం జగదీశ్, జి.వెంకటరావు, కనకభవానీ, రుద్రకుమార్, వెంకటరావు, అప్పారావు, విందుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68, 69 వార్డులకు కూటమి నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, జి.తాతారావు, డి.అప్పలరాజుల ఆధ్వర్యంలో శ్రేణులు తరలివెళ్లారు. నాతయ్యపాలెంలో కూటమి నాయకులు గోపిశెట్టి గోపి, ఎ.శ్రీను, జి.మధులత ఆధ్వర్యంలో, హరిజన జగ్గయ్యపాలెంలో నాయకుడు అలమండ రాజు నేతృత్వంలో కార్యకర్తలు పీఎం సభకు బయలుదేరి వెళ్లారు.

వేపగుంట: జీవీఎంసీ 89 నుంచి 98వ వార్డుకు సంబంధించి ప్రధాని సభకు జనాలను తరలించే ఏర్పాట్లను జెడ్పీ కె.హైమావతి పర్యవేక్షించారు. జనాల తరలింపు కోసం 240 బస్సులను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆమె ఆయా పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీడీ చిరంజీవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ కమిటీ నూతన కార్యవర్గం

పెదగంట్యాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి పెంటమాంబ ఆలయ కమిటీకి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బుధవారం ఆలయం ఆవరణలో సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కమిటీ డైరెక్టర్లుగా గొందేశి మహేశ్వరరెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, జి.అప్పలరెడ్డి, జి.సత్యారావు, వై.శ్రీనివాసరావు, ఎన్.రెడ్డి, జి.పైడిరాజు, కోశాధికారులుగా పి.కుంచారావు, ఎం.శ్రీరామమూర్తి, పి.అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారితో ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ పవిత్రతను, ప్రతిష్ఠను కాపాడుతామని వారు ప్రతిజ్ఞ చేశారు.

వృథాగా పోతున్న తాగునీరు

పెదగంట్యాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 64వ వార్డు పరిధి దిబ్బపాలెం కాలనీకి సరఫరా కావాల్సిన తాగునీరు వృథాగా పారుతూ కాలువలో కలుస్తుంది. అండర్‌గ్రౌండ్ వాటర్ పైపు లైన్లు రెండుచోట్ల లీకైన కారణంగా ఈ పరిస్థితి నెలకొంది. గిరిజాకాలనీ నుంచి దిబ్బపాలెం వెళ్లేప్రధాన రహదారిలో పైపులైన్ లీకవుతోంది. ప్రియదర్శనీ కాలనీలోని వాటర్ పంప్ హౌస్ నుంచి కాలనీకి నీరు పంపింగ్ చేసే సమయంలో



పెద్దఎత్తున నీరు రోడ్డుపై ప్రవహిస్తూ కాలువలో కలు స్తుండడంతో పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులుగా ఇలా నీరు వృథాగాపోతున్నా పంప్ హౌస్ ఆపరేటర్లు, సచివాలయ సిబ్బంది కానీ జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం అధికారులు గానీ పట్టించుకోక పోవడం దారుణమని మండిపడు తున్నారు. ఇప్పటికైనా ఉన్నతా ధికారులు స్పందించి తాగునీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

- సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పద్మనాభరాజు
- 100 రోజులకు చేరిన దీక్ష



దీక్షలో పాల్గొన్న కార్మిక నేతలు

అక్కయ్యపాలెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పోర్టు ఆస్పత్రికి టెండర్ పేరుతో ఎవరొచ్చినా అడ్డుకుంటామని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు వీఎస్ పద్మనాభరాజు హెచ్చరించారు. ఆస్పత్రి ప్రైవేటీకరణను నిరసిస్తూ నిర్వహిస్తున్న నిరసన దీక్షలు బుధవారానికి వంద రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ నిర్ణయం అనైతికమని, ఆస్పత్రి అభివృద్ధి కార్మికుల కృషితోనే సాధ్యమైందన్నారు. అటువంటి ఆస్పత్రిని ప్రైవేటీకరణ చేస్తే 40 వేల మంది కార్మికుల ఆరోగ్యాన్ని తాకట్టు పెట్టినట్లేనని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, జె.సత్యనారాయణ, కేఎస్ కుమార్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య సాహిత్యంపై చర్చ

సీతంపేట, జనవరి 8, (ఆంధ్రజ్యోతి) : స్థానిక సీతంపేట రాజేంద్రనగర్‌లో గల ప్రిజమ్ కళాశాలలో సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో అన్నమయ్య సాహిత్యంపై చర్చ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ అన్నమయ్య సాహిత్యంలోని విశిష్టతను వివరించారు. ప్రముఖ రచయిత ఎంవీజీ భువనేశ్వరరావు మృతికి సంతాపం తెలుపుతూ నివాళులు అర్పించారు. రచయిత డాక్టర్ కేజీ వేణు సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డా.డీవీ సూర్యారావు, డా.సూరపనేని విజయ్‌కుమార్, కె.రాంప్రసాద్, సీహెచ్ సత్యనారాయణమూర్తి, డా.కేవీఎస్ మూర్తి, డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ కె.రాజశేఖర్, రామతాత, పరమేశ్వరరావు, బి.రాధారాణి, తనెకెళ్ల సూర్యకళ, శివాజీ పాల్గొన్నారు.

ప్రధాని సభకు తరలిన నేతలు

మురళీనగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో జరిగిన ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభ, రోడ్‌షో కార్యక్రమాలకు బుధవారం విశాఖ ఉత్తరం నుంచి భారీగా జనం తరలి వెళ్లారు. నియోజకవర్గంలోని మాధవధార, బర్మా క్యాంప్, 51వ వార్డు ప్రాంతాల నుంచి జనసేన, బీజేపీ, టీడీపీ నేతలు పెద్ద సంఖ్యలో వెళ్లారు.

నిర్లక్ష్యం.. నిలువెత్తుగా

- ముస్లిం తాటిచెట్లపాలెం సర్వీసు రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు
- విద్యుత్ దీపాలు వెలగక రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాలు
- తొలగింపునకు చర్యలు తీసుకోని అధికారులు



రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు

అక్కయ్యపాలెం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 44వ వార్డులోని ముస్లిం తాటిచెట్లపాలెం నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న సర్వీసు రోడ్డులో విద్యుత్ స్తంభాలు మార్గానికి మధ్యలో ఉన్నాయి. దీంతో అటుగా రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మట్టి రోడ్డు ఉండేది. కొన్నేళ్ల కిందట సీసీ రోడ్డు వేశారు. అప్పటి నుంచి ఈ మార్గంలో ట్రాఫిక్ రద్దీ పెరిగింది. రాత్రి వేళల్లో వీధి లైట్లు వెలగకపోవడంతో ఆ సమయంలో ఈ దారిలో వెళాలంటేనే ప్రమాదకరంగా మారుతోందని స్థానికులు, వాహనచోదకులు వాపోతున్నారు. ఈ రోడ్డులో చిరు వ్యాపారస్థులు తమ వ్యాపారాలను కొనసాగిస్తుంటారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్, దుకాణాలు వంటివి ఉండడంతో కొనుగోలుదారులు ఎక్కువగానే రాకపోకలు సాగిస్తుంటారు. ముస్లిం తాటిచెట్లపాలెంలోని వీధుల్లోకి వెళ్లాలంటే ఈ సర్వీసు రోడ్డు నుంచే రావాల్సి ఉంటుంది. దీంతో ద్విచక్ర వాహనాలు ఎక్కువగా తిరుగుతుంటాయి. చీకటిగా ఉండడంతో విద్యుత్ స్తంభాలకు ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో తరచూ ఇలాంటి ప్రమాదాలే అధికం.

ఇదే రోడ్డులో మైక్రోవేవ్ పెద్ద టవర్ కూడా ఉంది. కొన్నిసార్లు రోడ్డు ఉంది కదా అనే ఉద్దేశంలో కార్లు, ఆటోలు వస్తుంటాయి. తీరా రోడ్డులోకి వచ్చిన తర్వాత ఇరుకుగా ఉండడంతో ఇబ్బందులకు గురవుతుంటారు. అప్పుడు వాహనాన్ని వెనక్కి మళ్లించేందుకు కూడా అవకాశం ఉండదు. దీంతో ట్రాఫిక్ జాం సమస్య ఎదురవుతోంది. ఇది చాలాదన్నట్టు ఈ రోడ్డు కాస్త వెడల్పు ఉన్న చోట కొందరు నిత్యం కార్లు నిలిపి వేస్తుంటారు. ఇది కూడా సమస్యగానే మారుతోంది.

ఇక్కడ రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని పలు మార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించామని, అయినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్తంభాలను రోడ్డు పక్కన ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ ప్రాంతంలో అధిక నివాసాలు ఉండడంతో ఒక్క విద్యుత్ స్తంభానికి పదుల సంఖ్యలో కనెక్షన్లు ఉన్నాయి. దీంతో విద్యుత్ రోడ్డు మధ్య నుంచి తొలగించడం క్లిష్టంగా ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు అంటున్నారు. కొన్ని రోజుల పాటు విద్యుత్ స్తంభాలను నిలిపివేయాల్సి ఉంటుందని, ఇందుకోసం ఉన్నతాధికారుల అనుమతి అవసరం ఉంటుందని చెబుతున్నారు.



వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న స్థలం

ప్రధాని సభకు ఎమ్మెల్యే విష్ణుకుమర్‌రాజు ఆధ్వర్యంలో కూటమి నేతలు



ర్యాలీగా బహిరంగసభకు వెళుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, కూటమి నేతలు నజీర్, ధర్మారావు, వసంతరావు తదితరులు

సీతమ్మధార, జనవరి 8, (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ మైదానంలో బుధవారం జరిగిన ప్రధాన నరేంద్ర మోదీ బహిరంగ సభకు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ఆధ్వర్యంలో కూటమి నేతలు ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. సీతమ్మధారలోని బీజేపీ కార్యాలయం వద్ద నుంచి టీడీపీ నాయకులు ఎండీ నజీర్, తదితర నాయకులతో కలిసి బుధవారం సాయంత్రం ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డుఅధ్యక్షుడు గొంప ధర్మరావు, వసంతరావు, పలు వార్డు అధ్యక్షులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీతంపేటలో..

సీతంపేట : గ్రేటర్ విశాఖ 25వ వార్డులో వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో సీతంపేట దుర్గాగణపతి ఆలయం వద్ద నుంచి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభకు బయలుదేరారు. పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆటోలతో ర్యాలీకి, బహిరంగ సభకు తరలించారు.

అక్కయ్యపాలెంలో..

అక్కయ్యపాలెం : పరిసర ప్రాంతాల నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు జనాలను తరలించారు. గ్రేటర్ 43వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బొడ్డేటి మోహన్ శ్రీదేవి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఎనభై అడుగుల రోడ్డులో ఆటోలతో ర్యాలీగా తరలి వెళ్ళారు. రైల్వే న్యూకాలనీ, శంకువానిపాలెం తదితర ప్రాంతాల నుంచి జనాలను తరలించారు.



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, పక్కన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

గోపాలపట్నం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నగరంలో జరగనున్న ప్రధాన మంత్రి మోదీ సభలో పాల్గొనేందుకు బుధవారం వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక విమానంలో సాయంత్రం విమానాశ్రయానికి చేరుకున్న చంద్రబాబుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, ముఖ్యమంత్రి కార్యక్రమ కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేశ్, శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, ఆర్డీవో పి.శ్రీలేఖ తదితరులు స్వాగతం పలికారు.

భీమునిపట్నం : ప్రధాని మోదీ విశాఖ పర్యటనలో పాల్గొనడానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. ఆయనతో పాటు గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కూడా ఉన్నారు.

ఆదాయపు పన్ను నుంచి గెస్ట్ లెక్చరర్లను మినహాయించాలి

వెంకోజీపాలెం, జనవరి 8 (ఆంధ్ర జ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలుకావస్తున్నా ఏయూలో ఇప్పటికీ మాజీ వీసీ ప్రసాదరెడ్డి పాలనే కొనసాగుతోందని భావన కలుగుతోందని అతిథి అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఏయూ అధికారులను అతిథి అధ్యాపకులు కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు.

తమ వార్షిక ఆదాయం లక్ష రూపాయలు దాటకపోయినా ఆదాయపు పన్ను అమలు చేస్తుండడం అన్యాయమన్నారు. ఏయూ వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ దీనికి వ్యతిరేకంగా ఉన్నా.. ఫైనాన్స్ అధికారి సానుకూలంగా లేరనే ఆరోపణలు వస్తున్నాయన్నారు.

యూనిటీ మాల్‌తో చేనేతకు ఊతం

... 5వ పేజీ తరువాయి

కమిషనర్ రేఖారాణితో కలిసి పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.172 కోట్లతో చేపడుతున్న నిర్మాణ ప్లాన్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాలుగు అంతస్థుల్లో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా భవన నిర్మాణం చేపడుతున్నామన్నారు.

వ్యాపారం, వినోదం

వ్యాపార అవసరాలతో పాటు వినోదం అందించేలా యూనిటీమాల్‌ను నిర్మించనున్నట్టు మంత్రి వివరించారు. జీప్లస్ 4గా నిర్మించే భవనంలో మొదటి రెండు అంతస్థుల్లో 62 షాపులు, మూడో అంతస్థును సీఫ్యూగా తీర్చిదిద్ది రెస్టారెంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. నాలుగో అంతస్థులో కన్వెన్షన్ హాలుతో పాటు రెండు మినీ థియేటర్లు, రిటైల్ స్టోర్లు, రెస్టారెంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఒకే భవనంలో వ్యాపారం, వినోదం లభించేలా ప్లాన్ రూపొందించామన్నారు.

రుషికొండ బీచ్, రామానాయుడు స్టూడియో తదితర ప్రదేశాలను సందర్శించే పర్యాటకులను ఆకట్టుకునేలా యూనిటీమాల్‌ను నిర్మిస్తామన్నారు.

విశాఖకు నవోదయం

... 5వ పేజీ తరువాయి

గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లు ఏర్పాటు కానున్నాయని, వాటిలో ఒకటి విశాఖపట్నమన్నారు. భవిష్యత్తులో హైడ్రోజన్ గ్రీన్ ఎనర్జీ ద్వారా ఏపీలో పెట్టుబడులు, తద్వారా భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రధాని వివరించారు. నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుతో మౌలిక వసతులు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. దేశంలో మూడు చోట్ల బల్క్ డ్రగ్ పార్కులు ఏర్పాటు చేయనుండగా అందులో ఒకటి నక్కపల్లిలో వస్తోందన్నారు.

దశ మార్చనున్న నీలి విప్లవం

సముద్ర వ్యాపారంలో శతాబ్దాల చరిత్ర గల విశాఖపట్నం నీలి విప్లవంతో మరోసారి తన ప్రాభవాన్ని చాటనుందని, ఇందులో భాగంగా విశాఖలోని ఫిషింగ్ హార్బర్‌ను ఆధునికీకరిస్తున్నామని ప్రధాని వివరించారు. దశాబ్దాలుగా విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ కోసం పోరాడిన ఇక్కడి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జోన్ ప్రధాన కార్యాలయానికి శంకుస్థాపన చేశామని, తద్వారా ఏళ్ల నాటి కలను సాకారం చేశామన్నారు. కాగా, విశాఖను ఆర్థిక రాజధానిగా మరింత బలోపేతం చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పునరుద్ఘాటించారు. ప్రపంచానికి అరకు కాఫీని పరిచయం చేసిన ఘనత ప్రధాని మోదీకి దక్కుతుందన్నారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుతో ఐటీ, ఫార్మా, టూరిజం అభివృద్ధి చెందుతాయని, తద్వారా ఉపాధి అవకాశాలు పెరిగి రాష్ట్రం ఆర్థికంగా బలోపేతమవుతుందని చంద్రబాబు వివరించారు.

ఎట్టకేలకు రైల్వే జోన్ కల సాకారం

... 5వ పేజీ తరువాయి

రద్దు చేసి, అందులో కీలక ప్రాంతాలను కొత్తగా ఏర్పాటుచేసిన రాయగడ డివిజన్‌లో కలిపి, మిగిలిన ప్రాంతాలను విజయవాడ డివిజన్‌లో ఉంచుతారని ప్రకటించారు. అయితే వాల్తేరు డివిజన్‌తో కూడిన జోన్ ఇవ్వాలని ఈ ప్రాంత ప్రజల డిమాండ్ మేరకు నాయకులు కేంద్రాన్ని కోరారు. దానికి సానుకూల స్పందన వచ్చిందని ప్రచారం చేశారు. అయితే బుధవారం ప్రధాని సభలో వాల్తేరు డివిజన్‌పై స్పష్టత ఇవ్వలేదు. పైగా దీనికి రెండు రోజుల ముందే రాయగడ డివిజన్ పరిధిని ప్రకటించారు. దానికి డివిజన్ రైల్వే మేనేజర్‌ను కూడా నియమించారు.

అంతకు ముందు డీఆర్ఎం కార్యాలయ నిర్మాణానికి శ్రీకారం కూడా చుట్టారు. ఇక్కడ జోనల్ కార్యాలయం నిర్మించాక కార్యకలాపాలు ప్రారంభిస్తామంటే మరో పుష్కరకాలం గడిచిపోతుంది. అలా కాకుండా ప్రస్తుతం అందుబాటులో ఉన్న భవనాల్లో జోనల్ కార్యాలయాలు ప్రారంభించాల్సి ఉంది. వీటిని పర్యవేక్షించడానికి జోన్‌కు జనరల్ మేనేజర్‌ను తక్షణమే నియమించాలి. అప్పుడే కేంద్రానికి చిత్తశుద్ధి ఉందని ఉత్తరాంధ్ర ప్రజలు విశ్వసిస్తారు.

కొత్త రైళ్లు... ప్రాజెక్టులు

విశాఖలో జోనల్ కార్యాలయం ప్రారంభమైతే అనేక ప్రయోజనాలు ఉన్నాయి.

ఈ ప్రాంత యువతకు అవకాశాలు పెరుగుతాయి. కొత్త రైళ్లను వేసుకోవాలన్నా, అత్యవసరంగా అదనపు కోచ్‌లు ఏర్పాటు చేయాలన్నా, సరకు రవాణాకు ర్యాక్‌లు ఇవ్వాలన్నా స్థానిక అధికారులు నిర్ణయం తీసుకోవచ్చు. తయారీ, ఉత్పత్తి రంగాలకు చెందిన ప్రాజెక్టులు వస్తాయి. జోనల్ స్థాయి రైల్వే ఆస్పత్రి వస్తుంది. సుదీర్ఘమైన తీర ప్రాంతం, పోర్టులు, విమానాశ్రయాలు ఉండటం, కొత్త పరిశ్రమలు రావడం వల్ల ఈ జోన్‌కు ప్రాధాన్యం పెరుగుతుంది. ఆదాయం పెరుగుతుంది. దానికి తగ్గట్టుగానే బడ్జెట్‌లో కేటాయింపులు వస్తాయి. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన రైల్వే వసతులు లభిస్తాయి.

రూ.2,08,548 కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపన

... 5వ పేజీ తరువాయి

3, 4 రైల్వే లైన్ల నిర్మాణం

- దువ్వాడ-సింహాచలం (ఉత్తర) మధ్య మూడు, నాలుగు రైల్వే లైన్ల నిర్మాణం
- విశాఖ-గోపాలపట్నం మధ్య 3, 4 రైల్వే లైన్ల నిర్మాణం
- గుత్తి-పెండేకల్లు మధ్య రైల్వే లైన్ డబ్లింగ్.
- మహబూబ్‌నగర్-డోన్ మధ్య రైల్వే లైన్ విద్యుద్దీకరణ
- ఎన్‌హెచ్-167కి ఆదోని వద్ద బైపాస్ నిర్మాణం
- డోర్నాల నుంచి కుంట జంక్షన్ వరకు ఎన్‌హెచ్-765 రెండో లేన్ నిర్మాణం
- సంగమేశ్వరం నుంచి నల్లకాలువ సెక్షన్ వరకు ఎన్‌హెచ్-167 రెండో లేన్ విస్తరణ
- ఎన్‌హెచ్ 67 నుంచి తాడిపర్తికి నాలుగో లేన్ నిర్మాణం
- ఎన్‌హెచ్-167బి లో మైదుకూరు నుంచి ముదిరెడ్డిపల్లి వరకు రెండో లేన్ నిర్మాణం
- ఎన్‌హెచ్-440లో వేంపల్లి నుంచి చాగలమర్రి వరకు రెండు, నాలుగో లేన్ల విస్తరణ
- ఎన్‌హెచ్-565లో దావులపల్లి నుంచి మల్లెపాలెం వరకు రెండో లేన్ నిర్మాణం
- ఎన్‌హెచ్-365బీబీలో బుట్టాయగూడెం నుంచి పట్టిసీమ వరకు రెండో లేన్ విస్తరణ
- ఎన్‌హెచ్-167 ఏజీలో కొండమోడు నుంచి పేరేచర్ల సెక్షన్ వరకు నాలుగో లేన్ విస్తరణ
- ఎన్‌హెచ్-516ఈ పాడేరుకు బైపాస్ రహదారి నిర్మాణం
- అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్ అభివృద్ధి
- కృష్ణపట్నం ఇండస్ట్రియల్ ఏరియాలో క్రిస్ సిటీ నిర్మాణం

జాతికి అంకితం చేసినవి

గుత్తి-ధర్మవరం రైల్వే లైన్ డబ్లింగ్, విజయవాడ-గుడివాడ-భీమవరం-నర్సాపూర్, గుడివాడ-మచిలీపట్నం, భీమవరం-నిడదవోలు రైలు మార్గాల విద్యుద్దీకరణ, ఇంకా మరో ఎనిమిది ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు.

నిత్యం ఉత్తర ద్వార దర్శనం బల్లిగిరి ప్రత్యేకం

వైకుంఠ ఏకాదశి రేపు

సర్వాంగ సుందరంగా అలంకరణ



అల్లిపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి రోజున భక్తులు వైష్ణవ ఆలయాల్లో స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటారు. అల్లిపురంలోని వెంకటేశ్వర మెట్ట బల్లిగిరి వెంకన్న ఆలయంలో మాత్రం ఇందుకు భిన్నం. ఈ ఆలయంలో భక్తులకు నిత్యం ఉత్తర ద్వార దర్శనం కల్పించడం ప్రత్యేకం. ఇక్కడి స్వామివారు ఉత్తరముఖంగా దర్శనమిస్తారు. 1834లో డచ్ దేశస్థులు ఈ ఆలయాన్ని నిర్మించినట్టు ఆధారాలున్నాయి. స్వామివారు బల్లి రూపంలో స్వయం భూ వెలసిన పుణ్యక్షేత్రమిది. విశాఖను కుదిపేసిన ఎన్నో తుఫాన్ల నుంచి స్వామివారు రక్షించారని నగరవాసుల నమ్మకం. ఈ కారణంతోనే నగరవాసులే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు ఇక్కడికి వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. కాగా శుక్రవారం వైకుంఠ ఏకాదశి కావడంతో ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. తెల్లవారుజామున 2.30 నుంచి ఏకాదశి పూజలు, 11న స్వామివారు వజ్ర కవచంతో దర్శనమివ్వనున్నట్టు ఈఓ రమాబాయి తెలిపారు.

12న జాతీయ యువజన దినోత్సవం

డాబాగార్డెన్స్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద 162వ జయంతి పురస్కరించుకుని ఈనెల 12న జాతీయ యువజన దినోత్సవం నిర్వహిస్తున్నట్టు ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం బుల్లయ్య కాలేజీలోని గాంధీ సెంటర్ హాల్‌లో ఈ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి సిక్కిం విశ్రాంత డీజీ ఆఫ్ పోలీస్ అత్తిలి సుధాకరరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి. బాలమోహన్‌దాస్ ప్రధాన ప్రసంగం చేస్తారని తెలిపారు.విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహిస్తామన్నారు.

బ్రహ్మకుమారి సంస్థకు స్థలం ఇవ్వాలని వినతి

మహారాణిపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం క్షేత్రం వద్ద జ్ఞాన విజ్ఞాన కేంద్రం, ఆధ్యాత్మిక మ్యూజియం, ఆసుపత్రి నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని ప్రజాపిత బ్రహ్మకుమారి ప్రతినిధులు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కోరారు. బుధవారం హోటల్ నోవాటెల్‌లో ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరయ్య విద్యాలయం ప్రతినిధులు రామేశ్వరి తన సహచర బృందంతో పాటు డిప్యూటీ సీఎంను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింహాచలం కొండ దిగువ ప్రాంతంలో దేవస్థానానికి వచ్చే భక్తులు, విద్యార్థులు, యువతకు సనాతన ధర్మంతో పాటు జ్ఞాన విజ్ఞాన అంశాలు వివరించేందుకు ఆధ్యాత్మిక సంగ్రహాలయం, భక్తుల ప్రథమ చికిత్సకు ఆసుపత్రి నిర్మాణానికి వెయ్యి గజాలు స్థలం ఇవ్వాలని కోరారు.



డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు జ్ఞాపిక అందిస్తున్న బ్రహ్మకుమారీలు

ఎవరికీ పట్టని 'ఘోషా'

- శిశువులకు అంతంతమాత్రమే వైద్య సేవలు
- స్పెషల్ కేర్ న్యూ బోర్న్ యూనిట్‌లో వైద్యుల కొరత
- సక్రమంగా అందని సేవలు



జగదాంబ కూడలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విక్టోరియా (ఘోష) ఆసుపత్రిలో శిశువులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందుబాటులో ఉండడం లేదు. ముఖ్యంగా పుట్టిన వెంటనే ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే పసికందులకు తక్షణమే చికిత్స అందించే వైద్య విభాగం అందుబాటులో లేదు. గైనిక్ వైద్య విభాగం నాలుగు యూనిట్లతో విస్తరించినా, అత్యవసర పిల్లల వైద్య విభాగం సేవలు కరువయ్యాయి. ప్రసవం కోసం వచ్చిన గర్భిణులకు గైనిక్ విభాగంలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. కానీ పిల్లల వైద్యం అందుబాటులో లేకపోవడంతో గైనిక్ వైద్యులు ఒత్తిడికి గురవుతున్నారు. ప్రసవం కోసం వస్తున్న గర్భిణుల్లో కొందరి శిశువులు పురిటిలోనే ఉమ్మనీరు మింగడం, పచ్చ కామెర్లు, బరువు తక్కువగా పుట్టడం వంటి అనారోగ్య సమస్యలకు గురవుతుంటారు. అటు వంటి వారికి స్పెషల్ కేర్ న్యూ బోర్న్ యూనిట్ (ఎస్‌సీఎన్‌యూ)లో చికిత్స అందిస్తారు. ఈ యూనిట్‌లో వైద్యారోగ్య శాఖ పిల్లల వైద్యులను నియమిస్తుంది. వైద్యులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో సేవల్లో ఇబ్బందులు ఎదురవుతున్నట్టు వైద్య వర్గాలు చెబుతున్నాయి. ఏఎంసీ నుంచి ఎస్‌సీఎన్‌యూలో ఇద్దరు పిల్లల వైద్యులను పలు సందర్భాల్లో కేజీహెచ్ నుంచి డెప్యుటేషన్‌పై తీసుకురావలసి వస్తోంది. కేజీహెచ్ పిల్లల విభాగంలో పడకలు పూర్తిగా నిండిపోవడంతో విక్టోరియాకు వైద్యులను పంపే పరిస్థితి లేదు. ఎస్‌సీఎన్‌యూ వార్డులో శిశువుల ఆరోగ్య పరిస్థితి విషమించితే కేజీహెచ్ పిల్లల వార్డుకు తరలించాల్సిందే. దీంతో ఒక్కోసారి పరిస్థితి విషమించి శిశు మరణాలకు దారి తీస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం

గైనిక్ విభాగానికి అనుబంధంగా పూర్తిస్థాయిలో పిల్లల విభాగం అందుబాటులో ఉండాలి.ఘోషా ఆసుపత్రిలో ఎస్‌సీఎన్‌యూ సేవల ద్వారా శిశువులకు వైద్యం అందిస్తున్నాం. ఆరోగ్యం క్షీణించిన శిశువులను కేజీహెచ్ పిల్లల వార్డుకు తరలిస్తాం.ఇక్కడ కనీసం రెండు పిల్లల వార్డుల యూనిట్లు ఉండాలి. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా అమలు కావడం లేదు. ఇక్కడి సమస్యను ఎమ్మెల్యే వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లాం.

- డాక్టర్ ఉషా ప్రసాద్, సూపరింటెండెంట్

డాబా గార్డెన్స్‌లో ట్రాఫిక్ కష్టాలు

డాబాగార్డెన్స్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 31వ వార్డు డాబాగార్డెన్స్‌లోని పలు ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భానుస్ట్రీట్, లలితా కాలనీ, శారదాస్ట్రీట్ ప్రాంతాల్లో వివిధ వాణిజ్య సముదాయాలు, ఫుడ్‌కోర్టులు, షాపింగ్ మాల్స్, ట్రాన్స్‌పోర్టు, కళాశాలలు ఉండడంతో వాహనదారులు ఆయా ప్రాంతాల మీదుగా రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. భాను స్ట్రీట్‌లో ఫుట్‌కోర్టు ఎదురుగా షాపింగ్ మాల్‌కు వచ్చేవారంతా ఏకంగా రోడ్డుపై పదుల సంఖ్యలో వాహనాలను నిలిపివేస్తున్నారు. దీనివల్ల రాకపోకలకు కష్టతరంగా మారుతోంది. ఎదురెదురుగా భారీ వాహనాలు వస్తే అర గంటకు పైగా ట్రాఫిక్ నిలిచిపోతోంది. అలాగే లక్ష్మీ స్ట్రీట్‌లో కొందరు దుకాణాల్లో ఉన్న వస్తువులను రోడ్డుపై ప్రదర్శనకు ఉంచడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. భాను స్ట్రీట్‌లో దుకాణాలకు వచ్చే వారు కార్లను రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. దీనివల్ల మరింత ట్రాఫిక్ రద్దీ నెలకొంటోంది. శారదా స్ట్రీట్, లలితాకాలనీలు భారీ ట్రాన్స్‌పోర్టు వాహనాలు, మినీ వ్యాన్‌ల పార్కింగ్‌కు అడ్డాగా మారిపోయాయి. ఇంతగా సమస్య ఎదురవుతున్నా ట్రాఫిక్ అధికారులు చూసీనట్టుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

'కొండపైకి ద్విచక్ర వాహనాలకు అనుమతి లేదు'

సాగర్‌నగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలో ఉన్న శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి వైకుంఠ ఏకాదశి రోజున కొండపైకి ద్విచక్ర వాహనాలను అనుమతించమని ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్తర ద్వార దర్శనానికి వేలాది మంది భక్తులు రానుండడంతో కొండపై పార్కింగ్ సమస్య తలెత్తకుండా బైక్‌లను అనుమతించడం లేదని చెప్పారు. భక్తుల సౌకర్యార్థం అదనంగా రెండు బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టు

సీతంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభను నిరసిస్తూ.. మద్దిలపాలెం కూడలిలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు ముందుస్తుగా అదుపులో తీసుకున్నారు. వారిని ద్వారకా పోలీస్ స్టేషన్‌కి తరలించారు. స్టేషన్‌లో ఉన్న నాయకులను ఏపీసీసీ అధ్యక్షుడు మాణిక్ ఠాకూర్ పరామర్శించారు. అనంతరం పోలీసులు వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడిచిపెట్టారు.



స్టేషన్‌లో ఉన్న నాయకులు

నమో అంటూ సమూహంగా..

- ప్రధాని సభకు భారీగా తరలిన జనం
- మోదీ, చంద్రబాబు, పవన్ అభిమానుల నినాదాలతో మార్మోగిన సభా ప్రాంగణం
- ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ర్యాలీగా రాక
- ఇబ్బందులు తలెత్తకుండా నేతల జాగ్రత్తలు
- ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసుల వ్యూహం


సభా వేదిక వద్దకు వెళుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్


బహిరంగ సభకు తరలివస్తున్న జనం

మద్దిలపాలెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : దారులన్నీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభవైపే అనే మాదిరిగా బుధవారం తండోపతండాలుగా ప్రజలు తరలివచ్చారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో బుధవారం నిర్వహించిన ప్రధాని మోడీ బహిరంగ సభకు అధిక జనం రావడంతో కూటమి ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, నేతల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. నగరంతో పాటు, సమీప జిల్లాల నుంచి బస్సులు, వ్యాన్లు, కార్లు, ఆటోల్లో ప్రజలు సందడిగా సభకు తరలివచ్చారు. కూటమి మూడు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తమ పార్టీల జెండాలు పట్టుకుని జై మోదీ, జై చంద్రబాబు, జై పవన్‌కల్యాణ్ అంటూ నినదించారు. దీంతో సభా ప్రాంగణం హోరెత్తింది. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ఒకే వేదికపైకి రావడంతో రెట్టింపు ఉత్సాహంతో కార్తకర్తలు పాల్గొన్నారు. భారీగా తరలివచ్చిన ప్రజలతో సభ ప్రాంగణంలో పండుగ వాతవరణం నెలకొంది. టీడీపీ, జనసేన, బీజేపీ జెండాల రెపరెపలాడాయి.

రెండు మార్గాల్లో సభకు ప్రవేశం..

ఏయూ మైదానంలోని మోదీ బహిరంగసభకు తరలివచ్చిన ప్రజలకు రెండు మార్గాల్లో ప్రవేశం కల్పించారు. పిఠాపురం కాలనీ, బలరాంనగర్ ఏయూ ఇంటర్నేషనల్ హాస్టల్ వద్ద ప్రహరీ ఓపెన్ చేసి ఆయా మార్గాల ద్వారా బస్సులను పంపించారు. వందల్లో వచ్చిన బస్సుల్లో వేలాది మంది జనాలు వారికి కేటాయించిన గ్యాలరీలకు చేరుకున్నారు.

మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బస్సుల్లో జనాభా వస్తూనే ఉన్నారు. గ్యాలరీల్లో ఉన్న ప్రజలకు వాటర్ ప్యాకెట్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఇతర జిల్లాల నుంచి జనాభాతో వచ్చిన కొన్ని వాహనాల డ్రైవర్లకు రూట్‌లు తెలియక ఇబ్బందులు పడ్డారు. మద్దిలపాలెం నుంచి ఉన్న మెయిన్ ఎంట్రన్స్ గేట్ వైపు వచ్చిన వాహనాలను నిలిపి జనాభాను దింపి వాహనాలను వెనక్కి పంపించారు. దీంతో ప్రజలు నడుచుకుంటూ సభకు వెళ్లారు. చాలా మందికి సభ ప్రాంగణంలోకి దారి తెలియక శివాజీపాలెం, పిఠాపురం కాలనీ రోడ్డులన్నీ కలియ తిరిగారు.

నగర పరిధి తూర్పు, దక్షిణ, ఉత్తర నియోజకవర్గాలకు చెందిన ప్రజలను ప్రధాని మంత్రి రోడ్ షో గ్యాలరీలకు తరలించారు. అనకాపల్లి జిల్లా, భీమిలి, పెందుర్తి ప్రాంతాలతో పాటు పలు జిల్లాల నుంచి వచ్చిన ప్రజలను ఏయూ మైదానంలోని ప్రధానమంత్రి బహిరంగ సభకు తరలించారు.

రోడ్ షోలో ఉత్సాహంగా ఎమ్మెల్యేలు

మద్దిలపాలెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) :వెంకటాద్రి వంటిల్లు నుంచి ఏయూ ఇంజనీరింగ్ కళాశల మైదానం వరకు బుధవారం నిర్వహించిన రోడ్డు షోలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు జనం నీరజనం పట్టారు. దారి పొడుగున వారిపై పూల వర్షం కురిపించారు. రోడ్డు షో ప్రారంభానికి ముందే జనాలు గ్యాలరీలకు చేరుకున్నారు. తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ గ్యాలరీల్లో ఏర్పాట్లు పర్యవేక్షించారు. తూర్పు, దక్షిణ నియోజకవర్గాల నుంచి భారీగా తరలివచ్చిన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. కూటమి పార్టీలకు చెందిన వేలాది మంది కార్యకర్తలు, అభిమానులతో గ్యాలరీలు కిక్కిరిశాయి. ఎమ్మెల్యేలు గ్యాలరీలన్నీ తిరుగుతూ రోడ్డు షో ప్రారంభం నుంచి ముగిసే వరకూ శ్రేణుల్లో ఉత్తేజం నింపారు. సాయంత్రం మోదీ రోడ్డు షో ప్రారంభం కాగానే నినాదాలతో హోరెత్తించారు. మోదీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లకు జేజేలు పలికారు. ఎమ్మెల్యేలు సైతం తమ పార్టీ జెండాలను పైకెత్తి ఊపుతూ మోదీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లకు స్వాగతం పలికారు.


కార్యకర్తలతో కలిసి జెండా పట్టుకొన్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

పవన్‌కల్యాణ్‌కు సాదర స్వాగతం

గోపాలపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ సభలో పాల్గొనేందుకు నగరానికి విచ్చేసిన డిప్యూటీ సీఎం కె.పవన్‌కల్యాణ్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. బుధవారం మధ్యాహ్నం ఎయిర్ పోర్టుకు చేరుకున్న ఆయనకు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గం గుండా హోటల్ నోవాటెల్‌కు వెళ్లారు.


కార్యకర్తలకు అభివాదం చేస్తున్న పవన్‌కల్యాణ్

భారీగా మహిళల తరలింపు


మహిళలకు ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

మద్దిలపాలెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22, 23వ వార్డుల నుంచి ప్రధాన మంత్రి బహిరంగ సభకు భారీగా మహిళలను తరలివచ్చారు. 22వ వార్డు నుంచి సుమారు 4 వేల మందిని సమీకరించారు. వారంతా పిఠాపురం కాలనీ వార్డు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ మహిళలకు టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో ఆహారం పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి పులిహోర, మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేసి ఆటోల్లో ప్రధానమంత్రి రోడ్ షో వేదిక వెంకటాద్రి వంటిల్లు వద్దకు తరలించారు.

జీవీఎంసీ 23వ వార్డులో గుడ్ల సత్యారెడ్డి ఆధ్వర్యంలో 1500 మందిని సభకు తరలించారు. తరలివెళ్లిన మహిళలకు ఆహారం పంపిణీ చేశారు.

కార్పొరేటర్ల ఆధ్వర్యంలో తరలిన కూటమి శ్రేణులు

వెంకోజీపాలెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఏయూ మైదానంలో జరిగిన దేశ ప్రధాని నరేంద్ర మోదీ సభకు 15, 16 వార్డుల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య జెండా ఊపి సభకు కార్యకర్తలను పంపించారు. దీనిలో 15వ టీడీపీ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, బోర ధనరెడ్డి, అప్పారి గిరిబాబు, కె.మహేష్, కర్రి గౌరీ, వరలక్ష్మి, సోని, 16వ వార్డు టీడీపీ అధ్యక్షుడు నారు గోపి, మొల్లి శంకర్, ముగడ వాసు, పల్లా ఉమారాణి, జి.అప్పన్న, మొల్లి శోభ, బీజేపీ నాయకులు పి.సత్యనారాయణ, కనకాల పాపారావు, జనసేన సాయిబాబా, కళ పాల్గొన్నారు.


ఎంవీపీ కాలనీ : 18వ వార్డు కార్పొరేటర్ మంగవేణి ఆధ్వర్యంలో సభకు బయలుదేరిన మహిళ


వెంకోజీపాలెం : జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీవిద్య

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ : ప్రధాని సభకు పద్దెనిమిదో వార్డు నుంచి జనం భారీగా తరలి వెళ్లారు. కార్పొరేటరు గొలగాని మంగవేణి పోలరావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు సామాన్య జనం కూడా బస్సులు, ఆటోల్లో తరలి వెళ్లారు.

పలుచోట్ల నిరసనకారుల అరెస్టు, గృహ నిర్బంధం

ఎంవీపీ కాలనీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని సభలో నిరసన వ్యక్తం చేయాలని వచ్చిన నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సుమారు 70 మంది ఎంవీపీ స్టేషన్‌కు తరలించారు. ప్రధాని సభ పూర్తయ్యే వరకూ వారిని స్టేషన్ ఆవరణలోనే ఉంచారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ వీరంతా నిరసనకు దిగారు. ప్రైవేటీకరణ నిలిపివేసేలా ప్రధానమంత్రి ప్రకటన చేయాలని నినదిస్తూ సభా ప్రాంగణం వద్దకు నిరసన కారులు చొచ్చుకెళ్లడానికి ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు సభ చుట్టుపక్కల ప్రాంతాల్లోనే వారిని పోలీసులు అడ్డగించారు. నిరసనకారులను ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని ఎంవీపీ స్టేషన్‌కు కూడా సీపీఐ జిల్లా సమితి సభ్యులు పడాల గోవింద్, ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యులు అడ్డూరి శంకరరావులను అరెస్టు చేసిన ఎంవీపీ పోలీసుస్టేషన్‌కు తరలించారు.


ఆరిలోవ : అరెస్టు అనంతరం ఆరిలోవ పోలీసుస్టేషన్‌కు తరలించిన సీపీఎం నేతలు


ఎంవీపీ కాలనీ : నిరసనకారులతో మాట్లాడుతున్న సీఐ మురళి

ఆరిలోవలో..

ఆరిలోవ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో బుధవారం జరిగిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభకు వెళుతున్న సీపీఎం స్థానిక నేతలను పోలీసులు గృహనిర్బంధం చేశారు. అయితే తాము వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై ప్రధాని నరేంద్ర మోడీ సభలో శాంతియుతంగా నిరసన తెలిపాలని బయలుదేరామని, పోలీసులు తమను అరెస్టు చేయడం దుర్మార్గమని సీపీఎం నేతలు పేర్కొన్నారు. పోలీసుల చర్యను సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు ఖండించారు. మద్దిలపాలెంలో అరెస్టు చేసిన సీపీఎం నేతలను పోలీసులు ఆరిలోవ పోలీసుస్టేషన్‌కు తరలించారు.

సినిమా గైడ్

- **బచ్చలమల్లి :** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2 :** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యుఐ :** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2 :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 35, టమాటా 14, వంకాయలు (తెలుపు)32, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 54, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 46, బీరకాయలు 52, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 18, క్యారెట్ 48 దొండకాయలు 46, బంగాళ దుంపలు 27, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 48, బరబాటి 46, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోస కాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, పొటల్స్ 60, కీరదోస 36, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 46, చిలగడ దుంపలు 36, కంద 66, దేముడు చిక్కుడు 56, గోరు చిక్కుడు 34, ఆగాకార దేశవాలి 100 ఆగాకర హైబ్రిడ్ 100, కూర పెండలం 34, బ్రకోలి 100 , నూల్‌కోల్ 34, పనస పొట్టు 200, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	102
లైవ్ ధర	122
విత్ స్కిన్	214
స్కిన్‌లెస్	224

ముక్కోటి ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు

- ప్రత్యేక పూజల కోసం వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- విద్యుద్దీపాలతో అలంకరణ


విద్యుత్ దీపాలతో అలంకరించిన త్రిమూర్తిక వేంకటేశ్వర ఆలయం

వెంకోజీపాలెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ఏకాదశి వస్తోందనగానే ఉత్తర ద్వారదర్శనమే గుర్తుకు వస్తుంది. వైష్ణవాలయాల్లో ప్రత్యేకించి ఏర్పాటు చేసే ఉత్తరద్వారం ద్వారాస్వామి వారిని దర్శించుకుంటే మోక్షం ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. అందుకే ఆ రోజు తెల్లవారుజాము నుంచే ఉత్తరద్వార దర్శనం చేసుకునేందుకు ఉవ్విళ్లూరుతుంటారు.

ఉత్తరద్వార దర్శన విశిష్టత

పాలసంద్రం మీద తేలియాడే విష్ణుమూర్తిని దర్శించుకునేందుకు ముక్కోటి దేవతలంతా ఈ ఏకాదశి తిథినాడు వైకుంఠాన్ని చేరుకుంటారని ప్రతీతి. అందుకే ఈ ఏకాదశికి ముక్కోటి ఏకాదశి అన్న పేరు వచ్చింది. మూడు కోట్ల ఏకాదశులకు సమానం కావడం వల్లే ఆ పేరు వచ్చిందనే వాదన లేకపోలేదు. వైకుంఠంలోని విష్ణుమూర్తి దర్శనమేఈ ఏకాదశి నాడు ముఖ్యమైన ఘట్టం. కాబట్టి దీనికి వైకుంఠ ఏకాదశి అన్న పేరూ ఉంది. మహావిష్ణువుని వైకుంఠ ద్వారం వద్ద దర్శించుకున్న మధుకైటభులనే రాక్షసులకు శాపవిమోచనం కలిగించుట, ఇక నుంచి ఎవరైతే ఆ వైకుంఠ ద్వారాన్ని పోలిన ఉత్తర ద్వారం నుంచి విష్ణుమూర్తిని దర్శించుకుంటారో, వారందరికీ కూడా తమలాగే మోక్షం కలగాలని ఆ మధుకైటభులు కోరుకోవడంతో ఉత్తర ద్వార దర్శనానికి ప్రాశస్త్యం ఏర్పడిందని పండితులు చెబుతారు. అటువంటి ఈ ఉత్తర ద్వార దర్శనం భక్తులకు కలిగించేందుకు వైష్ణవ ఆలయాలన్ని సిద్ధమౌతున్నాయి. ఎంఎంటీసీ కాలనీలోని త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయం, హెచ్‌బీ కాలనీ శివాలయం సముదాయంలోనున్న వెంకన్న స్వామి ఆలయం, కొత్త వెంకోజీపాలెం శ్రీకోదండరామలయంలో వేంచేసి ఉన్న శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం, ఇతర దేవాలయాన్ని ముక్కోటి ఏకాదశికి సిద్ధమవుతునాయి.

మెడ్‌టెక్‌కు చేరుకున్న దివ్యాంగ క్రీడాకారులు


మెడ్‌టెక్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన దివ్యాంగ క్రీడాకారులు

గాజువాక, జనవరి 8: జాతీయ స్థాయి బోసియా చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు దివ్యాంగ క్రీడాకారులు బుధవారం మెడ్‌టెక్‌కు చేరుకున్నారు. ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు విశాఖ మెడ్‌టెక్ జోన్‌లో జాతీయ స్థాయి బోసియా పోటీలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ పోటీల్లో దేశంలోని 21 రాష్ట్రాలకు చెందిన సుమారు 103 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. గురువారం నాటికి మొత్తం క్రీడాకారులు ఇక్కడకు చేరుకోనున్నారు. క్రీడా పోటీల నిర్వహణకు గాను అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సువిశాలమైన ఆరు కోర్టులను, ప్రాక్టీస్ చేసుకునేందుకు గాను రెండు కోర్టులను సిద్ధం చేశారు. బుధవారం ఇక్కడకు చేరుకున్న కొంత మంది క్రీడాకారులు ప్రాక్టీస్‌కు శ్రీకారం చుట్టారు. కాగా ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులంతా వీల్‌చైర్లకే పరిమితమయ్యే పరిస్థితి ఉండడంతో వారికి వసతి సదుపాయాలను క్రీడా ప్రాంగణానికి సమీపంలోనే మెడ్‌టెక్ సంస్థ ఏర్పాటు చేసింది. ఎంతో ప్రతిష్టాత్మకంగా జరగనున్న ఈ పోటీలను పర్యవేక్షించేందుకు గాను దేశ, రాష్ట్ర స్థాయి నుంచి బోసియా స్పోర్ట్స్ ఫెడరేషన్లకు చెందిన ప్రత్యేక ప్రతినిధులు ఇప్పటికే ఇక్కడకు చేరుకున్నారు.

ఆదాయపు పన్ను నుంచి గెస్ట్ లెక్చరర్లను మినహాయించాలి

వెంకోజీపాలెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలుకావస్తున్నా ఏయూలో ఇప్పటికీ మాజీ వీసీ ప్రసాదరెడ్డి పాలనే కొనసాగుతోందని భావన కలుగుతోందని అతిథి అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఏయూ అధికారులను అతిథి అధ్యాపకులు కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. తమ వార్షిక ఆదాయం లక్ష రూపాయలు దాటకపోయినా ఆదాయపు పన్ను అమలు చేస్తుండడం అన్యాయమన్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన అనేక మంది నష్టపోతున్నారన్నారు. ఏయూ వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ దీనికి వ్యతిరేకంగా ఉన్నా.. ఫైనాన్స్ అధికారి సానుకూలంగా లేరనే ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఫైనాన్స్ అదికారి ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగుల అతిథి అధ్యాపకుల సమస్యలను సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని యూనివర్సిటీ అధికారులు, ఎఫ్‌వోను కోరారు. కార్యక్రమంలో అతిథి అధ్యాపకులు సురేష్‌మీనన్, ప్రసాద్, శిరీష్, నరేంద్ర, నాగరాజు, విక్టర్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న గెస్ట్ లెక్చరర్స్

పార్కింగ్ స్థలాన్ని ఆక్రమించి ఫుడ్‌కోర్టులు

- వైఎంసీఏ వద్ద ఇష్టారాజ్యం
- వాహనదారులకు తప్పని అవస్థలు
- చోద్యం చూస్తున్న అధికారులు

రామ్‌నగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సాగర తీరంలో వాహనాల పార్కింగ్ స్థలాల్లో ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో రోజూ బీచ్‌రోడ్డుకు వచ్చే సందర్శకుల వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ఈ ఆక్రమణ వల్ల దారులు ఇరుకుగా తయారవుతుండడంతో అవస్థలు తప్పడం లేదని వాహనదారులు వాపోతున్నారు.


సాగరతీరానికి ప్రతి రోజూ వేలాది మంది సందర్శకులు వస్తుంటారు. ఆదివారం, సెలవు దినాల్లో మరింత తాకిడి ఉంటుంది. ఇక్కడకు వచ్చే ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనం లేదా కార్లలో వస్తుంటారు. బీచ్ రోడ్డుకు వచ్చే సందర్శకుల కోసం వైఎంసీఏ ప్రాంగణంలో ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాన్ని కేటాయించారు. కానీ ఈ స్థలంలో లెక్కకు మించి ఫుడ్‌కోర్టులు ఏర్పాటు చేయడంతో పార్కింగ్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ప్రాంతంలో ఎక్కడ పార్కింగ్ చేద్దామన్నా ఫుడ్‌కోర్టు నిర్వాహకులు ఆ స్థలంలో తమ సొంతమన్నట్టుగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అదేమని ఎవరైనా ప్రశ్నిస్తే.. జీవీఎంసీకి ఏటా రూ.లక్షలు చెల్లించి ఇక్కడ వ్యాపారం చేస్తున్నామంటూ రంకెలు వేస్తున్నారు. దీంతో వాహనదారులు గత్యంతరం లేక ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలిపి వేస్తున్నారు. సాయంత్రం అయ్యేసరికి ఈ ప్రాంతమంతా అస్తవ్యస్తంగా పార్కింగ్ చేసి కనిపిస్తుంటుంది.


పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేసిన ఫుట్‌కోర్టులు


రోడ్డుపై నిలిపిన వాహనాలు

ట్రాఫిక్ పోలీసులు రాంగ్ పార్కింగ్ పేరుతో ఫోటోలు తీసి చలానాలు పంపిస్తున్నారు. ఇక్కడి పార్కింగ్ స్థలంలో ఇష్టారాజ్యంగా ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేయడంపై అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. కానీ జీవీఎంసీ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యపై దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వాహనదారులు, సందర్శకులు కోరుతున్నారు.



వేదికపై ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అభివాదం.. పక్కన మంత్రి లోకేశ్



వేదికపై ప్రధాని నరేంద్ర మోదీ, గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

మోదీకి బ్రహ్మరథం

భారీగా తరలివచ్చిన జనం

» రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం



ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం



బహిరంగ సభకు తరలివస్తున్న ప్రజలు

» పూలవర్షం కురిపించిన అభిమానులు

» కిక్కిరిసిన సభా ప్రాంగణం

» ప్రధాని ప్రసంగానికి కేరింతలు, చప్పట్లు

» మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం నగరంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనంపైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మధ్యాహ్నం మూడు గంటల నుంచే వివిధ ప్రాంతాల నుంచి కూటమి పార్టీల అభిమానులు, నాయకులు, కార్యకర్తలు చేరుకోవడంతో మైదానం నిండిపోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. ఊహించిన దానికన్నా సభ విజయవంతం కావడంతో కూటమి పార్టీల నాయకుల్లో కొత్త ఉత్సాహం తొణికిసలాడింది.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



ప్రధాని సభకు బస్సుల్లో తరలివచ్చిన ప్రజలు



ప్రధానిని శాలువతో సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు



కూటమి పార్టీల జెండాలతో అభిమాని



బహిరంగ సభకు తరలివస్తున్న మహిళలు



వేదికపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, అనిత

ప్రధాని సభలో సైడ్‌లైట్స్

సాయంత్రం 5.20 గంటలకు సభా ప్రాంగణానికి ప్రధాని రోడ్‌షో ప్రవేశించింది. అక్కడి నుంచి వేదిక వెనుక ఉన్న గ్రీన్‌రూమ్‌కు చేరేందుకు పదినిమిషాలు పట్టింది. గ్యాలరీల్లో ఉన్న ప్రజలకు ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎం అభివాదం చేశారు. ప్రతిగా ప్రజలు పూలు చల్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

- వేదికపై ప్రధాని నరేంద్రమోదీ సహా 16 మంది వేదికపై ఆశీనులయ్యారు.
- గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్, కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, సత్యకుమార్ యాదవ్, గొట్టిపాటి రవికుమార్, టీజీ భరత్, వంగలపూడి అనిత, టీడీపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, దగ్గుబాటి పురందేశ్వరి, విశాఖ, అనకాపల్లి ఎంపీలు ఎం.శ్రీభరత్, సీఎం రమేష్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ వేదికపై ఉన్నారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ హిందీ ప్రసంగాన్ని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలుగులో అనువదించారు. మోదీ సుమారు 12 నిమిషాలు ప్రసంగించారు. ఆ తరువాత వేదికపై ఉన్న నేతలను పలుకరించారు. చక్కని అనువాదం చేశారని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు భుజం తట్టి ప్రశంసించారు. మంత్రి లోకేశ్‌తో కరచాలనం చేస్తూనే చంద్రబాబుతో అతని గురించి ప్రధాని మాట్లాడారు.
- అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ స్వాగతం పలుకుతూ ప్రధాని, సీఎం పేర్లు ప్రస్తావించినపుడు సభికులు చప్పట్లు కొట్టారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేరు ప్రస్తావించగానే కేరింతలతో హర్షధ్వానాలు చేశారు. సభ ప్రారంభం నుంచి ముగిసే వరకు బీజేపీ నాయకులు నృత్యాలు చేశారు.





సభకు హాజరైన మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, సవిత, ఎమ్మెల్యేలు జిల్లా అధికారులు



బస్సు వద్ద మహిళల సందడి



వేదికపై ఎంపీ సీఎం రమేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

కూటమితో పారిశ్రామికవేత్తలకు భరోసా

» అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్

విశాఖపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గత సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించడం ద్వారా బలమైన పాలన సాధ్యమైందని, దీనివల్ల రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలకు భరోసా లభించిందని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ పేర్కొన్నారు. ఏయూలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. వైసీపీ విధ్వంసపాలనతో రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిపై కారుమబ్బులు కమ్ముకున్నాయన్నారు. ఎంతోమంది పారిశ్రామికవేత్తలను భయపెట్టి తరిమేశారన్నారు. రాష్ట్రంలో కొత్తవెలుగులు రానున్నాయని, దీనికి నిదర్శనమే రెండు లక్షల కోట్ల పెట్టుబడులన్నారు. దేశ అభివృద్ధి, ఆర్థిక ప్రగతికి ప్రధాని నరేంద్రమోదీ ఎంతగానో కృషిచేస్తున్నారన్నారు. ఏపీ పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చే పెట్టుబడులను అనకాల్లి నియోజకవర్గంలో పెడుతుండడంతో తన జన్మ ధన్యమైందన్నారు. భవిష్యత్తులో రాష్ట్రాభివృద్ధికి దోహదం చేసే మరిన్ని తీపి కబుర్లు వింటామన్నారు.



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న మంత్రి లోకేశ్



సదస్సులో ప్రసంగిస్తున్న ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్

ఐటీ హబ్‌గా విశాఖ

విశాఖలో ప్రపంచానికే తలమానికంగా నిలిచే డేటా సెంటర్ త్వరలో ఏర్పాటు కానుందని ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ అన్నారు. డీప్ టెక్ నైపుణ్య ఫౌండేషన్, ఏపీ డిజిటల్ టెక్నాలజీ లీడర్ షిప్ ఫోరం విశాఖలో నిర్వహిస్తున్న రెండు రోజుల ఏపీ డిజిటల్ టెక్నాలజీ సదస్సు-2025ను బుధవారం ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. - వార్త మెయిన్ 2లో

మోదీ వైఖరిపై ఉక్కు నాయకుల మండిపాటు

కూర్మన్నపాలెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణపై ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యటనలో ప్రస్తావించకపోవడంపై కార్మిక నాయకులు మండిపడ్డారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన 36 గంటల నిరాహార దీక్ష బుధవారం రాత్రి 8 గంటలతో ముగిసింది. అనంతరం కార్మికులు మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కూర్మన్నపాలెం రహదారిపై పది నిమిషాల పాటు బైఠాయించారు. ఈ సందర్భంగా నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, ఎన్.రామారావు మాట్లాడుతూ మోదీ ఉక్కు కర్మాగారంపై మాట్లాడకపోవడం తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. ప్రైవేటీకరణ ఉపసంహరణ, సొంత గనుల కేటాయింపు, క్యాపిటల్ రీస్ట్రక్చరింగ్ కింద రూ.17 వేల కోట్ల ఆర్థిక సాయంపై ప్రధాని ప్రస్తావించకపోవడంద్రోహంగా పేర్కొన్నారు. ఎన్నికల ముందు హామీలిచ్చిన సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు విశాఖ ఉక్కు ఊసే ఎత్తకపోవడం బాధించిందన్నారు. ఉద్యమాన్ని ఉధృతం చేయడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, కేఎస్ఎన్ రావు, వరసాల శ్రీనివాసరావు, పెంటారావు, రామ్మోహన్‌కుమార్, గోపి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మోదీ గోబ్యాక్ నినాదాలతో వామపక్షాల ధర్నా

మద్దిలపాలెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ నిలిపివేయాలంటూ వామపక్ష నేతలు, కార్మిక సంఘాల నాయకులు మద్దిలపాలెం కూడలిలో బుధవారం గో బ్యాక్ మోదీ నినాదాలతో ఆందోళనకు దిగారు. ప్రధానికి వ్యతిరేకంగా బ్యానర్లను శరీరానికి చుట్టుకుని ఆందోళన చేశారు. మోదీ సభ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకుని, అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో రోడ్డుపై బైఠాయించడంతో వ్యాన్లు, జీపుల్లోకి ఎక్కించి ఎంవీపీకాలనీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ తూర్పు ఇన్‌చార్జి ప్రియాంక దండి, కార్యకర్తలు ధర్నాకు దిగడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అరెస్టులను సీపీఎం, సీపీఐ నేతలు గంగారావు, పైడిరాజు ఖండించారు.



మద్దిలపాలెంలో నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

'విశాఖసాక్షిగా మరోసారి ద్రోహం'

విశాఖపట్నం: విశాఖసాక్షిగా ప్రధాని మోదీ మరోమారు ద్రోహం చేశారని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రాన్ని వేధిస్తున్న సమస్యలపై ఆయన స్పందించక పోవడం తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. గ్రీన్‌ఎనర్జీ ప్రాజెక్టు నిర్మాణం ఎన్‌టీపీసీ ద్వారా జరగడం ప్రభుత్వరంగ ప్రాధాన్యతను తెలుపుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ఊసే ఎత్తలేదని, విశాఖ మెట్రో రైలుపై మాట్లాడలేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ మరిచిపోయారన్నారు.